

స్టీల్‌ప్లాంట్ జీఎం ఇంట్లో విదేశీ మద్యం స్వాధీనం



- ఇతర రాష్ట్రాల మద్యం కూడా...

స్టీల్‌ప్లాంటులో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవికుమార్ ఇంట్లో భారీగా విదేశీ మద్యంతోపాటు డిఫెన్స్ మద్యం, ఇతర రాష్ట్రాలకు చెందిన 67 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- వార్త మెయిన్‌లో

సీబీఐకి విద్యార్థిని కేసు

సుప్రీంకోర్టు ఆదేశం

నగర పోలీస్ వర్గాల్లో గుబులు

- నీట్ శిక్షణ కోసం నగరంలోని కార్పొరేట్ కళాశాలలో చేరిన పశ్చిమ బెంగాల్ విద్యార్థిని
- 2023 జూలై 14న హాస్టల్ భవనం పైనుంచి పడి మృతి
- ఫోర్త్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఘటన
- కల్పబుల్ హోమిసైడ్ (304 పార్ట్ 11)గా కేసు నమోదు
- హత్య కేసుగా నమోదు చేయాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్
- పశ్చిమ బెంగాల్ సీఎం ఆదేశాల మేరకు అక్కడ కేసు నమోదు
- తాజాగా సీబీఐకి అప్పగింత

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

పశ్చిమ బెంగాల్‌కు చెందిన నీట్ విద్యార్థిని మృతి కేసు నగర పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. సీబీఐకు అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో నాడు కేసును దర్యాప్తు చేసిన అధికారుల్లో ఒకింత ఆందోళన నెలకొంది.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థిని నీట్ కోచింగ్ కోసం 2022లో నరసింహనగర్‌లోని ఆకాశ్ బైజూస్ ఆధ్వర్యంలో నడుస్తున్న అచీవర్స్ (ఆకాశ్) కాలేజీలో చేరింది. బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ దొండపర్తిలోని ప్రైవేటుహాస్టల్ (సాధన హాస్టల్)లో ఉండేది. విద్యార్థిని 2023 జూలై 14వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో హాస్టల్ గది నుంచి టెర్రస్‌పైకి వెళ్లింది. అక్కడ ఏం జరిగిందో కానీ ఐపాడ్, చెప్పులతోపాటు కొన్ని దుస్తులను టెర్రస్ రక్షణ గోడపై ఉంచి కిందకు పడిపోయింది. అయితే రాత్రి 12.40 గంటల సమయంలో విద్యార్థిని కిందపడి పోయినట్టు హాస్టల్ వార్డెన్ సూర్యకుమారి, వాచ్‌మన్‌గా ఉన్న ఆమె భర్త గుర్తించి ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ స్టేషన్ జీడీ రిజిస్టర్‌లో ఎంట్రీ చేసి ఘటనా స్థలానికి వెళ్లారు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థినిని సమీపంలోని వెంకటరమణ ఆస్పత్రికి తీసుకువెళ్లగా డాక్టర్ రాజేష్ చికిత్స అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు మరునటిరోజు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చి విద్యార్థినిని కేర్ ఆస్పత్రికి తరలించారు. 17న చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీనిపై ఫోర్త్ టౌన్ పోలీసులు 174 సెక్షన్ కింద కేసు నమోదుచేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు తమ కుమార్తె మరణంపై అనుమానం వ్యక్తంచేస్తూ 'ఎవరో ఆమెను కిందకు తోసేసి ఉంటారని' హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు అందజేశారు. హత్యాయత్నం జరిగిందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో 174 సెక్షన్ కింద కేసు నమోదుచేసినట్టు విలేకరుల సమావేశంలో అప్పటి సీపీ త్రివిక్రమవర్మ వెల్లడించారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలన్నీ హాస్టల్‌లోని నాలుగు సీసీ కెమెరాలతోపాటు పక్కనే ఉన్న సంఘవి లామినేషన్స్‌కు చెందిన సీసీ కెమెరాల్లో కూడా రికార్డయినందున వాటి ఆధారంగా కేసు నమోదుచేసి, దర్యాప్తు జరిపామని ప్రకటించారు. నగర పోలీసుల దర్యాప్తు సరిగా లేదని ఆరోపిస్తూ మృతురాలి తల్లిదండ్రులు పశ్చిమ బెంగాల్ వెళ్లి అక్కడ సీఎం మమతా బెనర్జీని కలిసి ఫిర్యాదు చేయడంతో నేతాజీనగర్ పోలీస్ స్టేషన్‌లో మరొక కేసు నమోదు



దొండపర్తిలోని ప్రైవేటు హాస్టల్ (ఫైల్ ఫొటో)

చేసి తర్వాత పశ్చిమ బెంగాల్ సీఐడీకి కేసు దర్యాప్తును బదిలీ చేశారు. దీంతో నగర పోలీసులు అప్రమత్తమై ఫోర్త్ టౌన్‌లో 174 సెక్షన్ కింద నమోదుచేసిన కేసును, హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం, భద్రతాచర్యల లోపం కారణంగా బాలిక మృతిచెందినట్టు గుర్తించి 304 పార్ట్ 2గా మార్చారు. హాస్టల్ వార్డెన్, వాచ్‌మన్‌తోపాటు ఆకాష్ బైజూస్ సంస్థకు చెందిన ఇద్దరు మేనేజర్లను నిందితులుగా చేర్చి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విషయమై పశ్చిమ బెంగాల్ సీఐడీ పోలీసులు పలుమార్లు నగరానికి వచ్చి పోలీస్ అధికారులతో మాట్లాడడంతోపాటు బాలిక మృతిచెందిన హాస్టల్ భవనాన్ని, కాలేజీని కూడా పరిశీలించారు. అనంతరం ఈ కేసు దర్యాప్తును సీబీఐకి

... మిగతా 6వ పేజీలో

స్టీల్ ప్లాంటులో ర్యాండమ్ తనిఖీలు



- విధులు ఎగ్గొట్టే ఉద్యోగులకు చెక్
- మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు
- సోమవారం నుంచి అమలు
- ఎవరైనా తమకు కేటాయించిన విభాగంలో లేకుంటే నిబంధనల ప్రకారం చర్యలు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

స్టీల్ ప్లాంటు యాజమాన్యం మరో కొత్త నిర్ణయం తీసుకుంది. విధులకు హాజరైన ఉద్యోగులు వారి వారి శాఖల్లో ఉన్నారా? లేదా? అని తెలుసుకోవడానికి ర్యాండమ్ (ఎంపిక చేసిన)గా తనిఖీలు చేయాలని నిర్ణయించింది. ఇదే విషయాన్ని ఉద్యోగులకు తెలియజేసింది. ఢిల్లీ నుంచి స్టీల్ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశం కాబట్టి అమలు చేస్తున్నామని పేర్కొంది.

స్టీల్ ప్లాంటులో కొంతకాలంగా ఉద్యోగుల హాజరుకు బయోమెట్రిక్ విధానం అనుసరిస్తున్నారు. ప్లాంటుకు వచ్చేటపుడు, తిరిగి వెళ్లిపోయేటపుడు బయోమెట్రిక్ వేయాలి. దానిని పరిగణనలోకి తీసుకొని జీతాలు ఇస్తున్నారు. అయితే కొంత మంది బయోమెట్రిక్ వేసిన తరువాత సంబంధిత విభాగానికి వెళ్లకుండా వేరే పనులు చక్కబెడుతున్నారని, తిరిగి డ్యూటీ ముగిసే సమయానికి వచ్చి మరో బయోమెట్రిక్ వేస్తున్నారని ఢిల్లీ కార్యాలయానికి సమాచారం అందింది. దాంతో వారు అన్ని విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఉద్యోగులంతా విధుల్లో ఉంటున్నారా?, లేదా?...అనేది చెక్ చేయాలని ఈ నెల 23న ఆదేశించింది. దానిని సోమవారం నుంచి అమలు చేస్తామని యాజమాన్యం అన్ని విభాగాలకు సమాచారం ఇచ్చింది. ఎవరైనా ఆయా విభాగాల్లో లేకపోతే నిబంధనల ప్రకారం

... మిగతా 6వ పేజీలో

వాట్సాప్‌లోనే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

- రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త సర్వీస్ ప్రారంభం
- ఆస్తి కొనుగోలుదారుడి ఫోన్ నంబర్‌కే డాక్యుమెంట్
- ఆ తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'ఒరిజినల్' అందజేత
- బయోమెట్రిక్ తప్పనిసరి
- ఇంతకుముందులా డాక్యుమెంట్ రైటర్లకు గానీ వేరొకరికి గానీ ఇవ్వరు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగుపరిచేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుంటోంది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వాట్సాప్ ద్వారానే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటివి అందించే ఏర్పాట్లు చేశారు. సుమారు 300 సేవలు వాట్సాప్‌లోనే అందుతున్నాయి. ఇప్పుడు తాజాగా రిజిస్ట్రేషన్ల శాఖ కూడా ఆ జాబితాలో చేరింది. ఏదైనా ఆస్తిని రిజిస్టర్ చేసినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఒరిజనల్ డాక్యుమెంట్ కాపీని కొనుగోలుదారుడి మొబైల్ నంబరుకు వాట్సాప్‌లో పంపించే ఏర్పాటు చేశారు. విశాఖపట్నంలో జిల్లాలో ఈ సర్వీసు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చింది.

ఎలాగంటే...?

ఇప్పటివరకూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌ను డాక్యుమెంట్ రైటర్లే సాయంత్రం వేళ తీసుకొని ఆ తరువాత తీరుబడిగా కొన్నవారికి ఇస్తున్నారు. దీని కోసం రిజిస్ట్రేషన్ సమయంలో 'నామినీ' పేరు రాయించేవారు. ఇప్పుడు వాట్సాప్ ద్వారా ఆ డాక్యుమెంట్‌ను వెంటనే పంపడానికి రిజిస్ట్రేషన్ల శాఖ కార్డ్ 2.0. సాఫ్ట్‌వేర్‌ను

... మిగతా 6వ పేజీలో

పారదర్శకత పెంచేందుకే...

- బాలకృష్ణ, రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ, విశాఖపట్నం



రిజిస్ట్రేషన్ల శాఖ వ్యవహారాల్లో పారదర్శకత పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనివల్ల ఎవరి డాక్యుమెంట్ వారికే అందుతుంది. వేరొకరు చూసే అవకాశం కూడా ఉండదు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో సరైన మొబైల్ నంబరు ఇవ్వాల్సి ఉంటుంది.



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్. హాజరైన ఐటీ రంగ ప్రతినిధులు

హార్డ్‌వేర్-సాఫ్ట్‌వేర్ మిళితం కావలసిన సమయమిది

'ఫ్యూజన్ ఏఐ' సదస్సులో ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా ఐటీ రంగంలో హార్డ్‌వేర్-సాఫ్ట్‌వేర్ రెండూ మిళితమై పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న ఫ్యూజన్ ఏఐ సదస్సుకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక రంగాల్లో వైద్యం, విద్య, ట్రాఫిక్ వంటి అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకమైన పాత్ర పోషిస్తున్నదన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా సీఎస్ఆర్‌తో కొత్త డిజైన్లు తయారుచేయాలని సూచించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఐటీ పెట్టుబడులను రాబట్టడంలో విశాఖపట్నం తన ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. సదస్సు నిర్వాహకులు శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ ఇంటెలిజెన్స్ (మేధస్సు)ను విభిన్న రంగాలతో అనుసంధానం చేయాలన్నారు. జియో చీఫ్ డేటా సైంటిస్ట్ శైలేష్ కుమార్, ఇన్ఫోసిస్ సెంటర్ హెడ్ ఎన్.సురేశ్ తదితరులు ప్రసంగించారు.

సెప్టెంబరులో మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రారంభం

- అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం
- గిరి ప్రదక్షిణ భక్తులకు ఇబ్బంది లేకుండా హనుమంతవాక, వెంకోజీపాలెం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు ప్రతిపాదన

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. పక్కన వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ, అనకాపల్లి, విజయనగరం, బీచ్ కారిడార్‌ను అనుసంధానం చేస్తూ మొత్తం 25 కొత్త రహదారులు ప్రతిపాదించామని, ఏడింటికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన వాటికి త్వరలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఆగస్టులో

... మిగతా 6వ పేజీలో

పారిశుధ్యంపై గ్రేటర్ కమిషనర్ దృష్టి

రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు

- కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేతన్ గార్గ్
- సమస్యలేవైనా ఉంటే పరిష్కరిస్తానని హామీ

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రత్యేకదృష్టి సారించారు. అందులో భాగంగా రాత్రివేళ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. స్వచ్ఛసర్వేక్షణ్-2025 పోటీల్లో నగరానికి ఉత్తమ ర్యాంకు దక్కేలా ఇప్పటినుంచే కార్యచరణ అమలు చేస్తున్నారు.



పూర్ణామార్కెట్ పరిసరాల్లో శుక్రవారం రాత్రి పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

నగరంలో పారిశుధ్య నిర్వహణకు ఐదు వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. కొందరు సరిగా విధులు నిర్వర్తించకపోవడం వల్లే పారిశుధ్యం ఆశించిన స్థాయిలో ఉండడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ కేతన్‌గార్గ్ రాత్రివేళ జరుగుతున్న పారిశుధ్య పనులను ఆకస్మికంగా పరిశీలిస్తున్నారు. నగరంలో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, మార్కెట్లు వంటి ప్రాంతాల్లో పగలు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, రాత్రివేళ మాత్రమే పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తుంటారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తెల్లవారేసరికి రోడ్లు, మార్కెట్లు ఆశించిన స్థాయిలో పరిశుభ్రంగా ఉండకపోగా, చెత్తతో దర్శనమిస్తున్నాయి. మార్కెట్‌లు, రోడ్లను

... మిగతా 6వ పేజీలో

అందరికీ అందుబాటులో ఉంటా

రోజుకు 16 గంటలు పనిచేస్తున్నా

- ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుంటే ఎవరూ నిరీక్షించాల్సిన అవసరం ఉండదు
- జీవీఎంసీకి మంచి గుర్తింపు తీసుకురావాలన్నదే నా లక్ష్యం
- కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

ప్రజా ప్రతినిధులతోపాటు ప్రజలకు కూడా నిత్యం అందుబాటులో ఉంటానని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. 'కమిషనర్‌పై టీడీపీ కార్పొరేటర్ల అసంతృప్తి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. తనను కలిసేందుకు వచ్చిన వారికి అవకాశం ఇవ్వడం లేదని కొందరు కార్పొరేటర్లు ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. తాను జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రోజుకు 16 గంటలు పనిచేస్తున్నానన్నారు. ఏదైనా సమీక్షలో ఉన్నప్పుడు, ఇంకెవరైనా ప్రజా ప్రతినిధులు కలిసి మాట్లాడుతున్నప్పుడు కార్పొరేటర్లుగానీ మరెవరైనా వచ్చినట్టయితే తనకోసం వేచి ఉండాల్సి ఉంటుంది తప్ప, తాను ఎవరినీ నిరీక్షించేలా చేయడం లేదన్నారు. తనకు తెలియకుండా ఒకరిద్దరు నిరీక్షించారేమోగానీ, ముందుగానే అపాయింట్‌మెంట్ తీసుకుంటే అసలు నిరీక్షించాల్సిన అవసరం ఉండదన్నారు. ఆరునెలలపాటు పూర్తిస్థాయి

... మిగతా 6వ పేజీలో

వైసీపీలో జడ్పీ లొల్లి

- పార్టీ సభ్యుల మధ్య విభేదాలు
- ఫోరం అధ్యక్షుడి మార్పు
- దొండా రాంబాబు స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం ఎన్నిక
- ఫ్లోర్ లీడర్‌కు సమాచారం నిల్



దొండా రాంబాబు



కర్రి సత్యం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యుల మధ్య విభేదాలు పొడచూపాయి. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షునిగా ఉన్న దొండా రాంబాబును తప్పించి ఆ స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యాన్ని ఎన్నుకున్నారు. శనివారం జడ్పీ స్టాండింగ్ కమిటీ మీటింగ్‌కు హాజరైన సభ్యులు తరువాత విడిగా సమావేశమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వ్యక్తిగత సహాయకుడు ప్రసాద్ (జడ్పీ ఉద్యోగి)ను తప్పించాలని కోరుతూ సంతకాలు సేకరించారు. ఫిర్యాదు కాపీపై 23 మంది సంతకాలు చేశారు. అయితే బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు, వైసీపీ జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దొండా రాంబాబు తొలుత సంతకం చేసి, ఆ తరువాత కొట్టేశారు. అప్పటికే ఫోరం అధ్యక్షుడిగా తనను తప్పిస్తారని

... మిగతా 6వ పేజీలో

గాజువాక-అచ్యుతాపురం రహదారిలో కంచె

- ఇనుప బారికేడ్లు ఏర్పాటుచేసిన స్టీల్‌ప్లాంటు యాజమాన్యం
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగింపు



గాజువాక-అచ్యుతాపురం మార్గంలో దుర్గానగర్ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన ఇనుప బారికేడ్లను శనివారం రాత్రి తొలగిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

గాజువాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

గాజువాక నుంచి అచ్యుతాపురం వెళ్లే మార్గంలో దుర్గానగర్ జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఇనుప బారికేడ్లను ఏర్పాటుచేసింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ బి.శ్రీనివాసరావు రాత్రి పది గంటల ప్రాంతంలో పోలీసుల సహకారంతో వాటిని తొలగించారు. వివరాలిలా ఉన్నాయి.

ఈ రోడ్డు విషయమై కర్ణవానిపాలెం ప్రాంతానికి చెందిన వెంకటరమణకు, స్టీల్‌ప్లాంటు యాజమాన్యానికి మధ్య కోర్టులో వివాదం నడుస్తుంది. తన స్థలాన్ని స్టీల్‌ప్లాంటు యాజమాన్యం రహదారి కోసం తీసుకొని నష్టపరిహారం చెల్లించలేదంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టు వివాదం నేపథ్యంలో

... మిగతా 6వ పేజీలో



గరుడ వాహనంపై స్వామివారు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళార్చన జరిపారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి పూజలు చేశారు. అనంతరం నిత్య కల్యాణం వైభవంగా జరిపారు.

చిల్లపేటలో 120 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు.పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు 120 మందిని పరీక్షించి, మందులు అందించారు. వారిలో టీబీ లక్షణాలున్న 50 మందికి కఫం పరీక్ష నిర్వహించి 30 మందికి టీబీ లక్షణాలున్నట్టు గుర్తించామని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు కె. సుస్మిత తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ ప్రేమకుమార్, చక్రవర్తి, వై. హరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

భీమునిపట్నం (రూరల్), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెంలో 20 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నించారు. సుమారు రూ. కోటి విలువ చేసే ఈ స్థలాన్ని చదును చేయించి తమ స్వాధీనానికి సన్నాహాలు చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు తహశీల్దార్ రామారావు దృష్టికి తీసుకువెళ్లడంతో శనివారం రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళ్లి హెచ్చరిక బోర్డు పాతారు. ఆ స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు.

చెత్త సేకరణకు మూడు రిక్షాలు వితరణ

భీమునిపట్నం (రూరల్), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం పంచాయతీలో చెత్త సేకరణకు మూడు రిక్షాలను దివీస్ కంపెనీ వితరణగా అందజేసింది. గ్రామ సచివాలయం కార్యదర్శి గోపాలకృష్ణకు దివీస్ ప్రతినిధి సురేశ్‌కుమార్ శనివారం వీటిని అందజేశారు. వీటిని రూ. 1.56.500 లతో కొనుగోలు చేసినట్టు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. అలాగే సచివాలయానికి అవసరమైన కంప్యూటరు, ప్రింటరును కూడా వితరణగా ఇచ్చారు.

కల్యాణ మండపాలు నిర్మించాలని వినతి

భీమునిపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడో వార్డులో కల్యాణ మండపాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొల్లలపాలెంలో కేజీబీవీ వద్ద నిర్మిస్తున్న కల్యాణ మండపం అసంపూర్తిగా ఉందని, అలాగే అప్పికొండ వీధిలో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

గిరిపై ఆరు సిమెంటు బెంచీలు ఏర్పాటు

పద్మనాభం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మద్ది గ్రామానికి చెందిన కంటుబోతు పెద సత్యం జ్ఞాపకార్థం అతని కుమారులు ఎంపీపీ కె. రాంబాబు, న్యాయవాది నారాయణరావు పద్మనాభుడి కొండపై ఆరు సిమెంటు బెంచీలను సమకూర్చారు. శనివారం వీటిని కొండ మీదకు చేర్చి ప్రారంభించారు.

వృక్ష ఫౌండేషన్‌కు అవార్డు

ఆనందపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన వృక్ష ఫౌండేషన్‌కు విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ అవార్డు అందించింది. ఆ సంస్థ వార్షికోత్సవంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేశ్‌కుమార్‌కు గేమ్ ఛేంజర్ 2025 అవార్డును అందజేశారు. తెలంగాణ హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ అలిశెట్టి చేతుల మీదుగా అవార్డు ఇచ్చారు. 12 ఏళ్లుగా వృక్ష ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి అగనంపూడి ప్రాంతానికి చెందిన గురు కృష్ణ చైతన్య రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను నగదు రూపంలో దేవాలయ ప్రజా సంబంధాల అధికారి పద్మనాభరాజుకు శనివారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబీకులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

వాకర్ సూర్యనారాయణకు సత్కారం

సింహాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సింహాచలంలో ఎస్వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సూర్యనారాయణను సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. గోశాల కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆయన్ను సత్కరించి, సేవా కార్యక్రమాలను కొనియాడారు.

మెట్రో ప్రాజెక్టుకు భూసేకరణ : కలెక్టర్



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూముల సేకరణలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్రోతో పాటు విశాఖపట్నం-గోపాలపట్నం మధ్య రైల్వే అధికారులు 3, 4 లైన్ల నిర్మాణం చేపడుతున్నారని, అలాగే పెందుర్తి-సింహాచలం నార్త్ స్టేషన్ మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, వడ్లపూడి జంక్షన్, గాజువాక-కణితి రోడ్డు, దువ్వాడ-సింహాచలం లైన్ల మధ్యలో చేపట్టే పనులకు కూడా భూమి అవసరమని, వాటిపై కూడా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణలో ప్రభావితమయ్యే కుటుంబాలకు పునరావాసం, పునర్నిర్మాణ పథకాలపైనా చర్చించారు. ప్రైవేటు భూమి 9.22 ఎకరాలు సేకరించాల్సి ఉందని, నిబంధనల ప్రకారం ముందుకువెళ్లాలన్నారు. నిర్దేశిత సమయాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్ఓ భవానీ శంకర్, ఆర్డీఓ శ్రీలేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పర్యాటక శాఖ జిల్లా అధికారి మాధవి, పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలు

- సాగర్‌నగర్ కాలనీలో నిత్యం అలజడి
- డివైడర్ మధ్య సిమెంట్ బెంచీలను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- గతంలో వాహనాలకు నిప్పు
- పోలీసులు స్పందించాలని స్థానికుల వేడుకోలు



డివైడర్ మధ్యలో ధ్వంసం చేసిన సిమెంట్ బెంచీలు

సాగర్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కాలనీలో ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇటీవల వరుసగా దొంగతనాలకు పాల్పడడంతో పాటు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడం, వాహనాల్లో పెట్రోల్ చోరీ చేయడం వంటివి జరిగాయి. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి జీవీఎంసీ సచివాలయం ఎదురుగా రహదారి మధ్యలో ఉన్న సిమెంట్ బెంచీలను ధ్వంసం చేశారు. వేసవిలో ప్రశాంతంగా కాసేపు బయట కాలక్షేపం కోసం డివైడర్ మధ్యలో దాతలు బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని మందుబాబులు అడ్డాగా చేసుకుని బెంచీలపై గంటల తరబడి ఉంటున్నారు. చుట్టుపక్కల ఇళ్ల వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ధ్వంసానికి గురైన బెంచీల వద్ద కొంతమంది మందుబాబులు గొడవ పడినట్టు సమీపంలో ఉన్న దుకాణాల యజమానులు, నివాసితులు చెబుతున్నారు. ప్రశాంతతకు మారుపేరు అయిన సాగర్‌నగర్‌లో ప్రస్తుతం ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. అర్ధరాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం ఎక్కువ అయినట్టు స్థానికులు చెబుతున్నారు. తెల్లవారుజామున ఆటోల్లో కాలనీలో రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నారు. కాలనీలో రహదారిపై నడవడానికి వీల్లేకుండా బడ్డీల వద్ద కార్లు, ఇతర వాహనాలను నిలిపి ఉంచడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. ఎక్కడెక్కడి నుంచో గంజాయి బ్యాచ్‌లు కాలనీకి వచ్చి నానా రభస చేస్తున్నారు.కొన్ని కూడళ్లలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అటువైపుగా వెళ్లాలంటేనే మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. ఆరిలోవ పోలీసులు తక్షణమే స్పందించి కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం : ఎమ్మెల్యే గంటా

రేఖవానిపాలెంలో 'సుపరిపాలనకు తొలి అడుగు'



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం (రూరల్), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. త్వరలోనే నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయం పథకాలను అమలు చేయనున్నట్టు తెలిపారు. శనివారం రేఖవానిపాలెం పంచాయతీ పరిధిలోని ఎల్లమ్మపేట, రాయిపాలెం, కీతిన్‌పేట గ్రామాల్లో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని చెప్పారు. 62 లక్షల మందికి సామాజిక పింఛన్లు, 67 లక్షల మందికి తల్లికి వందనం అమలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇమేజ్‌తో రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో రూ. 46.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

భద్రయ్యపేట గ్రామానికి కేజీహెచ్ వైద్యులు



కిడ్నీ రోగులతో మాట్లాడుతున్న వైద్య బృందం

పద్మనాభం జూలై 26 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని భద్రయ్యపేట గ్రామంలో కేజీహెచ్ వైద్యులు శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. నెఫ్రాలజీ విభాగం అధిపతి డా. డి. రాధాకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు రోగుల్ని పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి నివేదికలు వస్తే వాటి ఆధారంగా రోగాల్ని నిర్ధారణ చేస్తామని చెప్పారు. 40 ఏళ్ల దాటిన వారికి రకాల నొప్పులు వస్తుంటాయని, వాటికి నొప్పి టాబ్‌లెట్లు వాడరాదన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఆహారపు నియామాలు పాటించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగానికి చెందిన వైద్యులు అనిత, రామునాయుడు, ప్రతిమ, శ్రీవిద్య, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మణికుమారి, బీజేపీ నాయకులు రూపాకుల రవికుమార్, టి. నాగమణి, పాలూరి కృష్ణారావు, సీరపు వెంకటరావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎడదాసరిపేటలో ఆక్రమణల తొలగింపు

తగరపువలస, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని ఎడదాసరిపేట వద్ద అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్‌ను అధికారులు శనివారం తొలగించారు. ఈ ప్రాంతంలో అనుమతి పొందిన లేఅవుట్‌లో 49 సెంట్ల స్థలం రిజర్వుగా విడిచిపెట్టారు. స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి అందులో షెడ్ నిర్మించారు.అందిన ఫిర్యాదు మేరకు సహాయ సిటీ ప్లానర్, సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి కట్టడాన్ని తొలగించారు.

ఏకపక్షంగా రోడ్డు విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ

తగరపువలస, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పోలీసుస్టేషన్ నుంచి తగరపువలస బంగ్లామెట్ట అవుట్ పోస్టు వరకు రోడ్డు విస్తరణ పనులకు అధికారులు శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. అయితే ఇది ఏకపక్షంగా జరిగిందని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్డు విస్తరణ ఏ ప్రాతిపదికన జరుగుతుందన్న సమాచారం ఎవరికీ లేదు. చిట్టివలసలో కొంతమందితో అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ విషయాన్ని విలేకరులకు కానీ, రాజకీయ పార్టీల నాయకులకు కానీ తెలియజేయలేదు. కూటమికి చెందిన కొంతమంది నాయకులు చెప్పిన విషయాలను నమోదు చేసుకుని అధికారులు వెళ్లిపోయారని తెలిసింది. కాగా ఈ రహదారిని 80 అడుగుల మేర విస్తరించడానికి ప్రతిపాదనలు తయారు చేయగా సమావేశంలో కొంతమంది 60 అడుగులు విస్తరిస్తే సరిపోతుందని చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ రోడ్డు 40 అడుగుల మేర ఉంది. రోడ్డు విస్తరణ గురించి మరోసారి ప్రజాభిప్రాయం సేకరించాలని పలువురు కోరుతున్నారు.

ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ

భీమునిపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, స్వీయింగ్ మిషన్ (కుట్టు మిషన్) కోర్సులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల వ్యవధి కలిగిన ఈ కోర్సుల్లో చేరాలనుకునే మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు 9014758949 ఫోన్ నంబరును సంప్రతించాలని ఆయన సూచించారు.

గట్టు నిర్మించాలని వినతి

భీమునిపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోస్తనీ నది కలుస్తున్న ఉప్పుటేరు వద్ద కాంక్రీట్ గట్టు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొట్టి రజనీకాంత్ కోరారు. శనివారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

మాడవీధిలో గేట్లకు తాళాలు

దేవస్థానం అధికారుల తీరుపై భక్తుల అసంతృప్తి



గేటు వద్ద కార్పొరేటర్ నరసింహం

సింహాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న మాడవీధిలో గేట్లకు అధికారులు తాళాలు వేయడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల్లో చాలామంది మాడవీధిలో స్వేచ్ఛగా తిరుగుతూ ఫొటోలు దిగుతుంటారు. గేట్లకు తాళాలు వేయడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాజగోపురం సమీపంలోని కాశీ విశ్వేశ్వరస్వామి దర్శనానికి కూడా భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాగా 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం శుక్రవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చిన సందర్భంలో మాడవీధిలో గేట్లకు తాళాలు వేసి ఉండడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తక్షణమే తాళాలు తొలగించాలని అధికారులను కోరారు. ఈవిషయమై ఈఓ త్రినాథ్‌ను వివరణ కోరగా రాజగోపురం వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దానివల్ల భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేదని చెప్పారు.

నేవల్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నేవల్ సిబ్బంది

భీమునిపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ రోడ్‌లో ఐఎన్ఎస్ కళింగ నేవల్ స్టేషన్‌లో శనివారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. 1999 జూలై 26న కశ్మీర్‌లోని కార్గిల్ వద్ద పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ విజయం సాధించింది. నేటికి 26వ ఏళ్ల పూర్తి కావడంతో నేవల్ స్టేషన్‌లో కార్గిల్ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. వంద మంది రక్తదానం చేశారు.

దసరాకు మెట్ల మార్గం తెరుస్తాం : ఈఓ

సింహాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై మెట్ల మార్గాన్ని దసరా నుంచి వినియోగంలోకి తీసుకురానున్నట్టు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ ఆచారం ప్రకారం విజయ దశమి నాడు స్వామివారి ఉత్సవమూర్తిని మెట్ల మార్గంలో తీసుకురావడం ఆనవాయితీ. చందనోత్సవం రోజున భక్తుల రద్దీ నియంత్రణకు జోడుభద్రాల మీదుగా తాత్కాలిక గోడ నిర్మించడం, ఉత్సవం రోజున గాలి వానకు అది కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. నాటి నుంచి కూలిన గోడ సమీపంలోని మెట్ల మార్గాన్ని అధికారులు మూసివేశారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబరులో దశమి నాడు పల్లకిలో స్వామివారు కొండదిగువకు ఇదే మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉన్నందున శుక్రవారం దేవదాయశాఖ మంత్రి దృష్టికి ఆలయ వైదిక ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. మెట్ల మార్గం తెరిపించాలని కోరారు. స్పందించిన మంత్రి ఈఓను మెట్లమార్గం తెరిపించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'కల్యాణ మండపాల వేలం నిలిపివేయాలి'

సింహాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానానికి చెందిన కల్యాణ మండపాల వేలంను తక్షణమే నిలిపివేయాలని విశ్వహిందూ పరిషత్ అర్చక, పురోహిత మఠ మందిర్ విభాగం అధ్యక్షుడు టోలీ పూడిపెద్ది శర్మ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల క్రితం కల్యాణ మండపాల నిర్వహణను దేవస్థానం వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందన్నారు. కాంట్రాక్టర్ భక్తుల నుంచి ఇష్టానుసారం నగదు వసూలు చేయడంతో గతంలో హిందూ సంఘాలతో కలిసి వేలం పాటను రద్దు చేయాలని నిరాహార దీక్ష చేశామని చెప్పారు. స్పందించిన దేవస్థానం అధికారులు వేలం రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ మళ్లీ వేలం నిర్వహణకు సన్నాహాలు చేస్తుండడం సరికాదన్నారు. వేలం రద్దు చేసి భక్తులకు తక్కువ ధరలకు కల్యాణ మండపాలను కేటాయించాలని ఆయన కోరారు.

సీబీఐకి విద్యార్థిని మృతి కేసు

... 5వ పేజీ తరువాయి

అప్పగించాలని బాలిక తల్లితండ్రులు ఏపీ హైకోర్టుని ఆశ్రయించారు. దీనిపై ఏపీ, పశ్చిమ బెంగాల్‌లో వేర్వేరుగా కేసులు నమోదైనందున సీబీఐకి అప్పగించాలని తాము ఆదేశించలేమని హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కేసును సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. అలాగే ప్రైవేటు విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా నిపుణులైన కౌన్సెలర్లను నియమించుకోవాలని ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ అధికారులు విద్యార్థిని కేసు దర్యాప్తు మొదలుపెడితే తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని, అప్పట్లో ఈ కేసు దర్యాప్తుతో సంబంధం కలిగిన అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

పారిశుధ్యంపై గ్రేటర్ కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

శుభ్రం చేయడానికి అవసరమైనంత మంది కార్మికులు లేకపోవడం వల్లనే పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణ జరగడం లేదని కార్మికసంఘాల నేతలు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచూ తనిఖీలు చేయడం ద్వారా వాస్తవ పరిస్థితిని, సమస్యలను గుర్తించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. అందులో భాగంగానే వారం కిందట వీఐపీ రోడ్డులో, ఈనెల 23న డైమండ్ పార్క్, శంకరమఠం రోడ్డులో రాత్రిపూట పారిశుధ్య పనులు పరిశీలించారు. శుక్రవారం రాత్రి పూర్ణామార్కెట్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంటోందని వాపోయారు. కుక్కల నుంచి తమకు రక్షణ కల్పిస్తే విధి నిర్వహణలో మరింత మంచి ఫలితాలు వచ్చేలా పనిచేస్తామని కమిషనర్‌కు వివరించారు. దీంతో సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్‌కు ఫోన్ చేసి పూర్ణామార్కెట్ ప్రాంతంలో కుక్కల సమస్య లేకుండా తక్షణం వాటిని పట్టే కార్యక్రమం చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అందరూ సమర్థంగా విధులు నిర్వర్తిస్తేనే పరిశుభ్ర నగరంగా గుర్తింపు వస్తుందని కమిషనర్ కేతన్‌గార్గ్ పారిశుధ్య కార్మికులకు వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని కమిషనర్ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

వైసీపీలో జడ్పీ లొల్లి

... 5వ పేజీ తరువాయి

ఆయనకు సమాచారం ఉండడంతోనే సంతకం కొట్టేశారని చెబుతున్నారు. ఇదిలావుండగా సీసీపై ఫిర్యాదు గురించి వైసీపీ ఫ్లోర్‌లీడర్, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజుకు సమాచారం లేదని తెలిసింది. ఆయనతోపాటు మరికొందరు సభ్యులు సంతకాలు చేయలేదు. కాగా జిల్లాలో 39 జడ్పీటీసీ స్థానాల్లో ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిపి వైసీపీకి 36 మంది సభ్యులు ఉన్నారు. ఛైర్‌పర్సన్ సుభద్రపై అసంతృప్తితో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన సర్వసభ్య సమావేశాన్ని 22 మంది సభ్యులు బహిష్కరించారు. తరువాత పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని ఛైర్‌పర్సన్, సభ్యుల మధ్య సయోధ్య కుదిర్చినా అది తాత్కాలికమేనని తాజా ఘటనలతో స్పష్టమైంది. ఫోరం అధ్యక్షుడిగా రాంబాబు స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యాన్ని ఎన్నుకోవడంతో సభ్యుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. అందరం కలిసి మాట్లాడదామని సత్యం చెప్పినా తరువాత ఏమి జరిగిందోగానీ ఆయనే ఫోరం అధ్యక్షుడు అంటూ సభ్యులు వెల్లడించారు. జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఎనిమిది నెలల కాలానికి గౌరవ వేతనం అందగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరో ఆరు నెలల వేతనం అందింది. సుమారు 30 నెలల కాలానికి గౌరవ వేతనం జడ్పీటీసీ సభ్యులకు రాలేదని అనేక పర్యాయాలు ఆవేదన వ్యక్తం చేసినా ఫోరం అధ్యక్షుడు పట్టించుకోలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. అందుకే ఫోరం అధ్యక్షుడిని మార్చుకున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయినట్టేనని ఒక సభ్యుడు వ్యాఖ్యానించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

అన్ని టెండర్లు పూర్తిచేసి సెప్టెంబరు రెండో వారంలో పనులు ప్రారంభించాలన్నారు. 2026 జూన్, జూలై నాటికి అన్ని రహదారులు అందుబాటులోకి తేవాలన్నారు. జీవీఎంసీ, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, సింహాచలం గిరిప్రదక్షిణ సమయంలో భక్తులు హనుమంతవాక, వెంకోజీపాలెం వద్ద హైవే దాటడానికి ఇబ్బంది పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, భవిష్యత్తులో సమస్య రాకుండా, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆ రెండు చోట్ల వినూత్నంగా ఆలోచించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్, పాల్గొన్నారు.

గాజువాక-అచ్యుతాపురం రహదారిలో కంచె

... 5వ పేజీ తరువాయి

ఈజంక్షన్‌లో రహదారి అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా రోడ్డును మూసివేసేందుకు స్టీల్‌ప్లాంటు యాజమాన్యం సిద్ధమైంది.

వేలాది మందికి ఇదే ప్రధాన రహదారి..

స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు, కార్మికులతో పాటు పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, ఫార్మాసిటీ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డును మూసేయడంపై వివాదం నెలకొనడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గాజువాక తహశీల్దార్ బి.శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని ఒక పరిశీలించారు. స్థలానికి సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత యజమానిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి పది గంటలకు ఇనుప బారికేడ్లను పోలీసుల సహకారంతో తొలగించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

స్టీల్ ప్లాంటులో ర్యాండమ్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపడతామని హెచ్చరించింది. దీనిపై కార్మిక, ఉద్యోగ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జీతాలు సక్రమంగా ఇవ్వకపోయినా కష్టపడి పని చేస్తున్నామని, పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడిపిస్తూ లాభాల బాటలోకి తీసుకువస్తున్నామని, అయినా ఇక్కడి సీఎండీ తమను విశ్వసించడం లేదని, అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ఏ సంస్థ అయినా పరస్పర విశ్వాసంతో ముందుకు వెళుతుందని, కానీ ప్రస్తుత ఇన్‌చార్జి సీఎండీ ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తూ ఉద్యోగులు, కార్మికుల ఆత్మాభిమానం దెబ్బతీస్తున్నారని వాపోతున్నారు.

వాట్సాప్‌లోనే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

... 5వ పేజీ తరువాయి

అప్‌డేట్ చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి కొనుగోలుదారుని మొబైల్ నంబరు నమోదు చేయాలని అడుగుతుంది. నమోదు చేశాక దానిని వారి దగ్గరున్న ఆధార్ బేస్డ్ సమాచారంతో నిర్ధారించుకుంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, డాక్యుమెంట్ డిజిటల్ స్కానింగ్ జరిగిన తరువాత సిస్టమ్ నుంచి ఆటోమేటిక్‌గా నమోదుచేసిన మొబైల్ నంబరుకు డాక్యుమెంట్ కాపీ వాట్సాప్‌లో వెళ్లిపోతుంది. మొబైల్‌లోనే ఓపెన్ చేసి చూసుకోవచ్చు. ఆ తరువాత సదరు వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకోవలసి ఉంటుంది. ఇంతకుముందులా వాటిని డాక్యుమెంట్ రైటర్లకు గానీ వేరొకరికి గానీ ఇవ్వరు.

అందరికీ అందుబాటులో ఉంటా

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ లేకపోవడంతో అనేక ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవడంతోపాటు ప్రతిరోజూ సాధారణ విధులను నిర్వర్తించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరం కాబట్టి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నగర భౌగోళిక స్థితి, సమస్యలపై అవగాహన కల్పించుకోవడం, ఉదయం, రాత్రివేళ నగ రంలో వార్డుల్లో పర్యటనలు కూడా మరోవైపు కొనసాగిస్తున్నానన్నారు. జీవీఎంసీకి మంచి గుర్తింపు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని, కార్పొరేటర్లు, నగరవాసులు తనకు సహకరించాలని ఆయన కోరారు.

ఉత్తరాంధ్ర నేతలకు అధిక ప్రాధాన్యం

- సమస్యల పరిష్కారంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పటినప్పటి నుంచి ఉత్తరాంధ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ, ముఖ్యనాయకుల భాగస్వామ్యంతో ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని ప్రజల ఆశయాలు, అవసరాలు బాగా అర్థంచేసుకున్న నాయకత్వం చంద్రబాబునాయుడిదే అన్నారు. ప్రజలు మెచ్చుకున్న నాయకులైన కింజరాపు రామ్మోహన్‌నాయుడునుకేంద్రమంత్రిగా, అశోక్ గజపతిరాజును గవర్నర్‌గా పదవులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే విద్య, వైద్యం, రవాణా రంగాల్లో పెట్టుబడులు ఉత్తరాంధ్రకు రాబట్టేందుకు ముఖ్యమంత్రి స్వయంగా కృషి చేస్తున్నారన్నారు. సీమాంధ్ర, ఉత్తరాంధ్ర సమాన అభివృద్ధి కోసం గడచిన కొన్ని రోజులుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు మైలురాళ్లగా నిలుస్తాయని శ్రీభరత్‌పేర్కొన్నారు.

15వ వార్డులో సమస్యల పరిష్కారానికి సహకరించండి

- మేయర్ పీలా శ్రీనివాసరావుకు కార్పొరేటర్ శ్రీవిద్య వినతి

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఆ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీలో మేయర్ చాంబర్‌లో శనివారం ఆయనను కలిసి సమస్యలను వివరించారు. వార్డులో ప్రధానంగా అండర్‌గ్రౌండ్ సమస్య ఉందని మేయర్‌కు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను పునరుద్ధరించామని, కానీ హెచ్‌బీకాలనీ, ఉమానగర్, దుర్గానగర్ ప్రాంతాలలో ఈ సమస్య కొనసాగుతుందన్నారు. జేఆర్‌నగర్, సీతమ్మధార, అంబేడ్కర్‌నగర్, ఎంఎంటీసీ కాలనీ ప్రాంతాలలో రోడ్డులు గోతులు ఏర్పడి వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మేయర్‌కువివరించారు.

ఏపీపీఎస్సీ చైర్మన్‌తో ఎమ్మెల్సీ చిరంజీవిరావు భేటీ

సిరిపురం , జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్ చైర్మన్, సెక్రటరీలను ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవరావు కలిసి పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్‌పై ప్రణాళిక ప్రారంభించాలని, గ్రూప్-2 అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసి ఫలితాలు ప్రకటించాలని, ఎఫ్‌బీవో, ఏబీవో, ఎఫ్ఎస్‌వో రెండు పరీక్షలూ ఒకే తేదీన జరగనున్నట్టు ప్రస్తావించగా చైర్మన్ స్పందిస్తూ అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా ఒకే పరీక్షా కేంద్రం కేటాయిస్తామని చెప్పారని చిరంజీవిరావు తెలిపారు. ఏపీపీఎస్సీ నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు, సకాలంలో ఫలితాలు, సిలబస్, ఏపీపీఎస్‌సీ సభ్యుల అర్హతలు తదితర అంశాలపై చర్చించడం జరిగిందని చిరంజీవిరావు తెలిపారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ప్రత్యేక కార్యాచరణతో ఆక్రమణల తొలగింపు

- ఆపరేషన్ లంగ్స్ లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసెస్ చేపట్టిన జీవీఎంసీ
- ఒక్కరోజులోనే మొత్తం 15 రిజర్వు ఓపెన్ స్పేస్‌లలో ఆక్రమణల తొలగింపు
- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



ఆక్రమణల తొలగింపు చేపడుతున్న దృశ్యం



ఆక్రమణలను తొలగించిన దృశ్యం

సిరిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని లే అవుట్‌లలో ఆక్రమణకు గురైన ఓపెన్ స్పేస్‌లను ఆపరేషన్ లంగ్స్ లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసెస్‌తో చేపట్టిన కార్యాచరణలో భాగంగా శనివారం నగరంలోని 15 రిజర్వు ఓపెన్‌స్పేస్‌లలోని ఆక్రమణలు గుర్తించి వాటిని పట్టణ ప్రణాళిక విభాగం తొలగించినట్టు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. నగరంలో ఖాళీ స్థలాలు, పార్కుల ఆక్రమణ, వాటి సంరక్షణ గురించి ఈ నెల 24న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. నగరంలోని అన్ని జోన్లలో లే అవుట్‌లలో ఉన్న ఓపెన్ స్పేస్‌లను ఆక్రమణలకు గురవుతున్నందున వాటిని గుర్తించి పరిరక్షించే దిశగా ప్రత్యేక ఆపరేషన్ కార్యక్రమం చేపట్టి ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ప్రత్యేక బృందం శనివారం ఆపరేషన్ లంగ్స్ లైఫ్ టు అర్బన్ పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. ఓపెన్ స్పేస్ ఆక్రమణల తొలగింపులు జోన్-1లో సంగివలస, జోన్-2లో ప్రశాంతినగర్, టీచర్ లేఅవుట్, డీఆర్కే రాజు టౌన్‌షిప్ లే అవుట్, కొమ్మాది, గ్లోబల్ స్కూల్ వెనుక వైపు కొత్తపాలెం, మధురవాడ, ఏఎస్ఆర్ నగర్, జోన్-3లో ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీ లే అవుట్, నక్కవానిపాలెం లేవుట్, జోన్ 5లో మర్రిపాలెం లే అవుట్, జోన్-6లో లంకెలపాలెం, శివాజీనగర్ లే అవుట్ గోదావరి టౌన్‌షిప్ నరవతో కలిపి మొత్తం 15 రిజర్వు ఓపెన్ స్పేస్‌లలో ఆక్రమణలను గుర్తించి సంబంధిత పోలీసుల సహకారంతో సదరు ఆక్రమణలను ఒక్క రోజులోనే తొలగించడం జరిగిందన్నారు. ఈ ఆక్రమణల తొలగింపులో సంబంధిత జోనల్ కమిషనర్లు, సహాయ ప్రణాళికాధికారులు, ప్రణాళికా విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొనడం జరిగిందన్నారు.

సైనికుల సేవలు చిరస్మరణీయం

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



కార్గిల్ స్కిట్ చేసిన విద్యార్థులతో సీపీ శంఖబ్ర బాగ్చి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దేశానికి సైనికులు అందించే సేవలు చిరస్మరణీయమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం 26వ కార్గిల్ విజయ్ దివాస్ పేరిట యాక్మి, ఏపీ సైనిక్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సైనికులకు అందరం సెల్యూట్ చేయాలన్నారు. కార్గిల్ యుద్ధంతో భారతదేశ సైనిక బలం ఎలాంటిదో శత్రుదేశాలకు రుచి చూపించారన్నారు. సిందూర్‌తో టెక్నాలజీలో భారతదేశం ఎంత ఎత్తున ఉందో ప్రపంచ దేశాలకు చాటిచెప్పామన్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ సరిహద్దుల్లో సైనికులు కళ్లార్పకుండా కాపలా కాయడం వల్లే మనం ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నామన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల కుటుంబాలకు అండగా నిలబడడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళులన్నారు. దేశ సరిహద్దుల్లో పని చేస్తున్న సైనికుల కుటుంబసభ్యులకు గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మెమొంటోలు ప్రదానం చేశారు. యుద్ధంలో అమరులైన జవానుల కుటుంబసభ్యులకు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో ఏపీ సైనిక సంక్షేమశాఖ డైరక్టర్ వి.వెంకటరెడ్డి, యాక్మి ప్రతినిధులు ప్రతాప్‌కుమార్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికుల తల్లులు, భార్యలకు సత్కారం

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని కార్యేషు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొత్త వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాలులో శ్రీకాకుళం చెందిన అమరవీరులైన 25 మంది వీర సైనికుల మాతృమూర్తులు, సతీమణులను ఘనంగా సత్కరించారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, బీజేపీ యువ మహిళా నేత శ్యామలదీపిక ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్యేషు స్వచ్ఛంద సంస్థ ద్వారా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అమరులైన సైనికుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రక్షణ రంగంలో సైనికుల త్యాగం మరువలేనిదని, వారి కుటుంబ సభ్యులను గౌరవించుకోవడం మన అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యేషు స్వచ్ఛంద సంస్థ ప్రజా సంక్షేమ ధ్యేయంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి ఏడాది ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్యేషు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇందిరా ప్రియదర్శిని, శిరీష, జయ, కీర్తి, మాదురి తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న అమర వీరుల తల్లులు, సతీమణులు

ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ



ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో సీపీ శంకబ్రత బాగ్చి

ఎంవీపీ కాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. అవినీతి ఆరోపణలు రాకుండా చూసుకోవాలని, ఫిర్యాదుదారులకు తగిన మర్యాద ఇవ్వాలని ఆదేశించారు. కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సీఐ మురళీని సూచించారు.

రౌడీ షీటర్ల ఫొటోలు రంగులు వెలిసిపోయి, అస్పష్టంగా ఉండడంతో 'ఇదేమిటి..' అంటూ ప్రశ్నించారు. తాజా ఫొటోలు పెట్టాలని ఆదేశించారు. స్టేషన్‌లో సౌకర్యాలు, సమస్యలను సీఐ మురళీని అడిగి తెలుసుకున్నారు.

ఏయూ లా కళాశాలలో స్వచ్ఛభారత్



ట్రాక్టర్‌పై చెత్తను తరలిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం ప్రేరణాత్మక ప్రసంగంతో ప్రారంభమైన కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేసి, కళాశాలలోని సీలింగ్ ఫ్యాన్లు, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, బహిరంగ స్థలాన్ని శుభ్రపరచడం ద్వారా పరిశుభ్రతా డ్రైవన్‌ను చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది రమణ, విశ్వనాథ్, రాజశేఖర్‌పాల్గొన్నారు.

సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీలను సందర్శించిన కలెక్టర్

బీచ్ రోడ్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో పని చేసే ఈ రీసెర్చ్ సంస్థలు నిర్వహించే కార్యకలాపాలను పరిశీలించారు. పరిశోధన అంశాలు, ప్రయోగాలు, సాంకేతిక పరిజ్ఞానంపై సాగే వినూత్న పరిశోధనల గురించి అక్కడి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల చేపలు, చేప పిల్లలు ఉత్పత్తి, లైవ్ ఫీడ్ యూనిట్లను పరిశీలించారు. సముద్ర మత్స్యసంపద అభివృద్ధికి నిర్వహిస్తున్న పరిశోధనలు, కార్యకలాపాల గురించి ప్రన్సిపాల్ సైంటిస్ట్, రీజనల్ సెంటర్ హెడ్ డా.జోకిజాకుదాన్ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మదు, డాక్టర్ శ్రీధర్, మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో



శ్రీకృష్ణాపురం బీఆర్టీఎస్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ఆరిలోవ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అడవివరం నుంచి హనుమంతవాక జంక్షన్ మార్గమధ్యంలోని శ్రీకృష్ణాపురం బీఆర్టీఎస్ రోడ్డులో శనివారం ఉదయం డివైడర్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో అక్కడ ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవింగ్ నేర్చుకునే క్రమంలో ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

అశోక్‌గజపతిరాజుకు బీజేపీ ఏపీ నేతల శుభాకాంక్షలు



గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌గజపతిరాజును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

పెదవాల్తేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని అశోక్‌గజపతిరాజును శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్ బాబు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను శనివారం మర్యాద పూర్వకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ శ్రీనివాసబాబు కలిశారు.

బోధనేతర విధుల నుంచి తప్పించండి

- డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులపై బోధనేతర పనులు భారం తగ్గించి బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ జీతాలను చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) కోరింది. శనివారం యూటీఎఫ్ జిల్లా కమిటీ నేతులు జిల్లా విద్యాశాఖాదికారి కార్యాలం ఎదుట పెద్ద ఎత్తున మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియి పూర్తఇ నెల రోజులు అయినప్పటికీ వేలాదిమంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలనే స్పృహ అధికారులకు లేకపోవడం అన్యాయమన్నారు. ఇది ఉపాధ్యాయుల పట్ల అధికారులు చూపుతున్న వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనులు పూర్తిగా తగ్గించాలని, ఉపాధ్యాయుల సెలవులు వినియోగించే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధించడం సరైన చర్య కాదన్నారు. విశాఖ జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రతి పనిని ఉపాధ్యాయులు గంటల వ్యవధిలోనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడం తగదన్నారు. దాదాపు 25 వేల మంది ఉపాధ్యాయులు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, నేతలు ప్రభాకరరావు, కోశాధికారి కె.రాంబాబు,జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రియాజ్ అహ్మద్, టి.జగన్, జిల్లా ఎడిట్ కమిటీ సభ్యులుకుమారి, గాజువాక మండల శాఖ అధ్యక్షులు ఇమంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ఆచరణలో సాకారం కావాలి

- ఏయూ వీసీ రాజశేఖర్



దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, పలువురు ఆచార్యులు, ఏయూ అధికారులు

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలను గౌరవించడంపై యువతరానికి అవగాహన కల్పించడం, ఈ దిశగా వారిని చైతన్య పరచడం ఎంతో అవసరమని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, సీఐఐ ఇండియన్ విమెన్ నెట్‌వర్క్ సంయుక్తంగా విమెన్ ఎట్ వర్క్, ప్లేస్ పాలిసీస్, ప్రాసెసెస్ ఫర్ ఇంక్లూషన్ అంశంపై శనివారం నిర్వహించిన సదస్సును వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమ ప్రాతినిధ్యం కల్పించడం ఎంతో అవసరమని, ఇది కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపితే సత్ఫలితాలు వస్తాయన్నారు. మహిళలకు సంబంధించిన విధాన నిర్ణయాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన జరపాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కార్పొరేట్ సంస్థలలో మహిళలకు కొంత మెరుగైన పరిస్థితులు, వసతులు లభిస్తున్నాయని, ఈ తరహాలో ప్రభుత్వ సంస్థల్లో సైతం అవసరమైన సదుపాయాలను కల్పించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ రాజ్యాంగం మహిళల రక్షణకు, సమాజంలో సమ్మిళితం చేయడానికి కల్పించిన ప్రాధాన్యతలను వివరించారు. డాక్టర్ దుర్గాబాయ్ దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సంచాలకులు ఆచార్య ఏ.పల్లవి, ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఆంధ్రప్రదేశ్ శాఖ వైస్ చైర్మన్ డాక్టర్ పి.ఉష పాల్గొన్నారు.

అశోక్‌కు గవర్నర్ గిరీ ఉత్తరాంధ్రకు దక్కిన గౌరవం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ఉత్తరాంధ్రకు చెందిన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్ పదవి లభించడం ఉత్తరాంధ్ర ప్రజలందరికీ గర్వకారణమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం దక్కిందని, ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలోనే కాదు, ఇక్కడి నాయకుల్ని ప్రోత్సహించడంలో కూడా టీడీపీ ముందు ఉంటుందనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర నుంచి అశోక్‌గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా పదవి రావడం, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర విమానయాన మంత్రిని చేయడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం టీడీపీకే సాధ్యమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో విద్యా సంస్థల స్థాపనకు, ఆలయాలకు వేల ఎకరాలను ధారదత్తం చేసిన అశోక్ గజపతిరాజును గత వైసీపీ ప్రభుత్వం మానసిక క్షోభకు గురి చేసిందన్నారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రను దోచుకోవటమే తప్ప ఇక్కడ నాయకులకు గౌరవ ఇవ్వలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు.

టీడీపీ హయాంలోనే ఉత్తరాంధ్రకు న్యాయం : పట్టాభిరామ్

పెదవాల్తేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్ పదవి రావడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. శనివారం ఉషోదయ జంక్షన్ వద్ద తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు.

డాక్టర్ నూకల ఆర్ఎల్ఎల్ సౌజన్యకు డాక్టరేట్



ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకుంటున్న సౌజన్య

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధకురాలు నూకల ఆర్ఎల్ఎల్ సౌజన్యకు డాక్టరేట్ లభించింది. విభాగ ప్రొఫెసర్ టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో 'పాఠశాల స్థాయిలో విద్యా సంబంధిత పథకాలు, సమర్థవంతమైన అమలు' అనే అంశంపై జరిపిన పరిశోధనకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ చేతుల మీదుగా సౌజన్య డాక్టరేట్ ఉత్తర్వులను అందుకున్నారు. విద్యా సంబంధిత సంక్షేమ పథకాలను మరింత విస్తృతం చేయడానికి, బలోపేతం చేస్తూ విద్యార్థులకు చేరువ చేసేందుకు అవసరమైన సూచనలను పరిశోధనలో సౌజన్య అందించిన తీరును పలువురు అభినందించారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఎన్ఎంయూఏ నిరసన



మద్దిలపాలెం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలోని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నాయకులు, కార్మికులు శనివారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విజయవాడలోని గవర్నర్‌పేట-2 డిపోలో, పాత బస్టాండులోని ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను నిరసిస్తూ విశాఖ రీజియన్‌లోని ఏడు డిపోల ఎన్ఎంయూఏ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం, గాజువాక, సింహాచలం, స్టీల్ సిటీ డిపోల వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్ఎంయూఏ జిల్లా కార్యదర్శి పిళ్లా శంకరరావు, అధ్యక్షుడు పీఎస్ మూర్తి, డిపో కార్యదర్శులు పాలపర్తి చిన్నా(మద్దిలపాలెం), ఎంవీఆర్ మూర్తి(విశాఖపట్నం), ఆర్.వసంతరావు (వాల్తేరు), జేఎస్ఎన్ రాజు (సింహాచలం), సాయిరామ్ (స్టీల్ సిటీ), బంగారుబాబు(మధురవాడ), తదితరులు పాల్గొన్నారు.

గెడ్డపై వృథా నిర్మాణం

- మూడు వైపులా కాలనీ రోడ్లు ఉన్నా మరో కొత్త కల్వర్టు మార్గానికి భూమిపూజ
- ఉడా కాలనీలో వెచ్చిస్తున్న జీవీఎంసీ నిధులు


రక్షణ గోడ లేని ఉడాకాలనీ రోడ్డు మలుపులోని గెడ్డ

మాధవధార, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ నిధులను నిరుపయోగ నిర్మాణాలకు కేటాయిస్తూ మాధవధార ఉడాకాలనీలో కొత్త కల్వర్టు పనులను ఆరంభించారు. కమ్యూనిటీ హాలు బస్టాపు నుంచి ఎగువన ఉన్న ఎల్ఐజీ ఫేజ్-2, ఎంఐజీ ఇళ్ల వద్దకు చేరడానికి ప్రతి ఇంటి ముందు నుంచి 24 అడుగుల బీటీ రోడ్డు ఉంది. 60 అడుగుల 48ఎ బస్‌రూట్ పక్కనే ఉన్న ఈ నివాస సముదాయాల కోసం 2000 సంవత్సరంలో వీఎంఆర్డీఏ 61 ఎకరాల 12 సెంట్ల స్థలంలో వేసిన లేఅవుట్ పూర్తి వసతులతో అందుబాటులో ఉంది. కాలనీలోని కమ్యూనిటీ హాలు, షాపుల కోసం 49 సెంట్ల భూమిని వీఎంఆర్డీఏ విడిచిపెట్టి సువిశాల మాధవధార కొండ పక్కగా 48ఎ బస్ రూట్‌ను కలుపుతూ నివాసితులకు స్థలాల్ని కేటాయించారు. ప్రతి ఇంటి ముందు నుంచి దారి ఉండేలా లేఅవుట్ రూపొందించారు. ఖాళీ తారురోడ్ల నిర్మాణాలకే 17 ఎకరాల 35 సెంట్ల భూమి విడిచి పెట్టినా, ఇప్పుడు కొత్తగా మళ్లీ గెడ్డలను మింగేస్తూ కల్వర్టులు కడుతున్నారు. మాధవధార ఉడాకాలనీలోని వ్యక్తిగత ఇళ్లన్నీ ఇప్పుడు అపార్టుమెంట్లుగా మారుతూ వస్తున్నా వాహనాల పార్కింగ్‌కు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అప్పట్లోనే సువిశాల రహదారులు వేశారు.

బిల్డర్ స్కెచ్.. అధికారులు సై: కాలనీలో ఇపుడు గ్యాస్ గోడౌన్ రోడ్డులో ఓ బిల్డరు తన కట్టడానికి మార్కెట్ లేదని తన నిర్మాణం పక్కనే ఉన్న ఉడాకాలనీ ప్రధానగెడ్డ మీదుగా కల్వర్టు వేసి అవతలివైపు 40 అడుగుల రోడ్డుకు అనుసంధానిస్తానని భవనం కట్టక ముందే బ్రోచర్లలో వేసి బిల్డింగ్‌లో ఫ్లాట్స్ కొనేవారికి చూపించాడు. దీంతో జీవీఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటరు ఓ ప్రణాళిక ప్రకారం అదే భవనానికి మూడు వైపులా రోడ్డు ఉన్నా ఇప్పుడు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుతో కొత్త కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేయించారు. కాలనీలో మరే భవనానికి లేని ప్రత్యేక వెసులుబాటు కోసం లోకల్‌గా ఉండే 10 మందితో సంతకాలు చేయించి నిర్మాణం తమకు అవసరమని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయానికి తప్పుడు నివేదిక చేరవేశారు. జీవీఎంసీ కూడా పరిశీలన లేకుండా నిధులు కేటాయించింది. ఎమ్మెల్యే వచ్చి పనులు ఆరంభించారు. సదరు బిల్డరు కట్టడాన్ని చేరడానికి కొండ పక్కగా ఓ దారి, మాధవధార కమ్యూనిటీ హాలు ముందు నుంచి మరో దారి, గ్యాస్ గోడౌన్ నుంచి ఇంకోటి ఉన్నాయి. పెద్ద పెద్ద లారీలు, పొక్లయిన్లు వెళ్లి పనిచేసినా ఇపుడు తోవ లేదంటూ వినతి పెట్టారు. పాత కల్వర్టుకు పక్కగా ఉన్న రోడ్డుపై రక్షణ లేక ఓసారి రాత్రి వేళ కారు రివర్స్ చేస్తుండగా గెడ్డలో పడిపోయింది. పిల్లలు ఆడుకునే పద్మావతి పార్కును ఆనుకొని ఉన్న ఈ గెడ్డ పక్కగా ఉన్న ఇళ్ల యజమానులు ఇలా క్రమంగా గెడ్డను ఆక్రమిస్తూ కట్టడాలు చేపడుతున్నారు. మరో వైపు రోడ్డు మలుపులో ఉన్న పాత కల్వర్టు వద్ద గెడ్డ ప్రమాదాలకు నెలవుగా మారింది. అయినా, ఇక్కడ రక్షణగోడ ప్రతిపాదన గానీ, ఆ దిశగా అభివృద్ధి పనులు గానీ లేవు. ఇప్పుడు మాత్రం ఓ బిల్డరు తన 5 అంతస్థుల నిర్మాణానికి రాజమార్గంలో ప్రభుత్వ నిధుల్ని తన సొంత వ్యాపారానికి అత్యంత తెలివిగా వేయించగలిగారు. స్థానిక కాలనీవాసులు మాత్రం ఈ వృధా పనుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజోపయోగ నిర్మాణాలకు జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమయం, ప్రభుత్వ ధనం కేటాయించాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ఓ బిల్డింగ్‌కి మాత్రమే ఉపయోగపడేలా నిర్మిస్తున్న కొత్త కల్వర్టు

వ్యూహాత్మకంగా మెట్రో ప్రాజెక్టుకు భూసేకరణ


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూముల సేకరణలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్రోతో పాటు విశాఖపట్నం-గోపాలపట్నం మధ్య రైల్వే అధికారులు 3, 4 లైన్ల నిర్మాణం చేపడుతున్నారని, అలాగే పెందుర్తి-సింహాచలం నార్త్ స్టేషన్ మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, వడ్లపూడి జంక్షన్, గాజువాక-కణితి రోడ్డు, దువ్వాడ-సింహాచలం లైన్ల మధ్యలో చేపట్టే పనులకు కూడా భూమి అవసరమని, వాటిపై కూడా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణలో ప్రభావితమయ్యే కుటుంబాలకు పునరావాసం, పునర్నిర్మాణ పథకాలపైనా చర్చించారు. ప్రైవేటు భూమి 9.22 ఎకరాలు సేకరించాల్సి ఉందని, నిబంధనల ప్రకారం ముందుకువెళ్లాలన్నారు. నిర్దేశిత సమయాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ భవానీ శంకర్, ఆర్డీఓ శ్రీలేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పర్యాటక శాఖ అధికారిణి మాధవి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై 30న సదస్సు

డాబాగార్డెన్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక సదస్సు నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఏయూ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో సదస్సు జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనుల కోసం మేయర్‌కు వినతి


అక్కయ్యపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు నగర మేయర్ పీలా శ్రీనివాస్‌ను శనివారం కలిసి వినతిపత్రంసమర్పించారు.


మేయర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రావణి

చిన్నూరులో శంకుస్థాపన

గ్రేటర్ 26వ వార్డు చిన్నూరు మసీద్ దగ్గర రూ. 16.78 లక్షల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జి నిర్మించేందుకు శనివారం టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ ముక్కా శ్రావణి శంకుస్థాపన చేశారు. చిన్నూరు గ్రామాభివృద్ధిలో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, నూతన బ్రిడ్జి నిర్మించేందుకు పనులు ప్రారంభించినట్లు శ్రావణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు బండి కన్నా, బీజేపీ నాయకుడు నాగడమూడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం స్టేషన్‌కు ఇద్దరు ప్రొబేషనరీ ఎస్ఐలు


ఎస్ఐలకు సూచనలు చేస్తున్న సీఐ రవికుమార్

కంచరపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు మరో ఇద్దరు ప్రొబేషనరీ ఎస్ఐలను కేటాయించడంతో వీరు స్టేషన్‌కు విచ్చేశారు. వీరికి సీఐ రవికుమార్ పలు సూచనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి మేరంగి అరుణ, విజయనగరం జిల్లా నుంచి ఎస్.అజయ్‌కుమార్‌లు 2024-25 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు. వీరిని కంచరపాలెం స్టేషన్‌కు కేటాయిస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశాలు జారీ చేశారు. వీరిద్దరూ ప్రొబెషన్‌లో భాగంగా ఆరు నెలలు కంచరపాలెం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తారు.

గుండె చికిత్సలు నిలిచిపోవడంపై వైసీపీ నిరసన


కేజీహెచ్ అధికారులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో గుండె శస్త్ర చికిత్సలకు అవసరమైన యంత్రాల కొనుగోలుకు వెంటనే నిధులు కేటాయించాలని మాజీ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. యంత్ర పరికరాలు లేక ఏడు నెలలుగా శస్త్రచికిత్సలు నిలిచిపోవటంతో శనివారం కేజీహెచ్ ఓపీ గేటు వద్ద మాస్కులు ధరించి బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి రూ.20 వేల చెక్కును సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి అందజేశారు. అనంతరం వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో గుండె శస్త్రచికిత్సలు నిలిచిపోతే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లుమూసుకున్నారని, కేవలం రూ.3 కోట్లు కేటాయించకపోవటం దుర్మార్గమన్నారు. వైద్యం అందక అనేక మంది పేదలు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కలెక్టర్ ఏంచేస్తున్నారు? తక్షణమే అయనను సస్పెండ్ చేయాలని గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏంపీ కోటా, సీఎస్ఆర్ నిధులు కేజీహెచ్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు జాన్‌వెస్లీ, పీతల వాసు, కోరాడ సురేష్, దశమంతుల మాణిక్యాలరావు, చిన్ని, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్ముకశ్మీర్‌లో జవాను మృతికి ఎమ్మెల్యే వంశీకృష్ణ సంతాపం


జవాను కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జ్ఞానాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన జ్ఞానాపురం వాసి ఆర్మీ జవాను అంథోని రాజు పార్థివదేహానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం నివాళులర్పించారు. దేశ సేవ చేసిన జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అలానే 34వ వార్డులో మృతి చెందిన జనసైనికుడు ఉమ్మడి సతీష్ మృతికి ఎమ్మెల్యే సంతాపం తెలిపారు.

కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళి


ప్రభుత్వ మహిళా కళాశాలలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు



సెయింట్ జోసెఫ్ కళాశాలలో విద్యార్థినికి బహుమతి ఇస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో భాగంగా ప్రాణాలర్పించిన కార్గిల్ అమరవీరులకు విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తూ శనివారం కళాశాలలోని కార్గిల్ విజయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.మంజుల అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో దేశభక్తి, సైనికులపై గౌరవం, సమాజ సేవ పట్ల చైతన్యం కలిగిస్తాయన్నారు. నాటి విజయంపై ఎన్‌సీసీ కేడెట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్‌సీసీ కేడెట్లు కార్గిల్ విజయాన్ని స్కిట్స్ రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డా కె.గీతాంజలి, ఆర్.కిరణ్మయి, డి.అరుణపద్మ, ఎన్‌సీసీ కేడెట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో..

జ్ఞానాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధం(1999)లో వీరమరణం పొందిన భారతదేశ సైనికుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాద చాంబర్ సీనియర్ న్యాయవాది ధనలకోటి రమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ రక్షణకు సైనికులు చేసిన, చేస్తున్న త్యాగాలు, పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యాపకులు పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్య కుమారి, లీలాప్రసాద్, ఎన్.నాగరాజు, రమేష్, టోనియా తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో మహిళ ఇల్లు కూల్చివేత

- అక్రమ నిర్మాణమని తెలిపిన అధికారులు
- రోడ్డున నిలబెట్టారని బాధితురాలి ఆవేదన


జీవీఎంసీ సిబ్బంది కూల్చివేస్తున్న ఇల్లు

సీతమ్మధార, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల ఒక ఇంటిని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు శనివారం పోలీసు బందోబస్తుతో వచ్చి కూల్చివేశారు. ఆ ఇంటిలో నివసిస్తున్న ఓ మహిళను రోడ్డుపై నిలబెట్టారు. ఇంటిలో సామాగ్రిని రోడ్డుపై పడవేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టడంతో తొలగిస్తున్నామని జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. బాధితురాలు కంటతడిపెట్టి వేడుకున్నా టీపీఓ శ్రీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది వారి పని వారు కానిచ్చేశారు.

'పన్నులు కడుతున్నా రోడ్డున పడేశారు'

ఆ స్థలంలో కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నానని, తల్లిదండ్రుల కాలం నుంచే చిన్న రేకులు, కమ్మలతో ఇల్లు కట్టి ఉంటున్నట్లు గుడ్ల దాలయ్యమ్మ విలపిస్తూ చెప్పింది. తన వద్ద ఉన్న పాత ఇంటి పన్ను పుస్తకాన్ని కూడా జీవీఎంసీ సిబ్బంది చూసి ఇస్తామని చెప్పి తీసుకొని తిరిగి ఇవ్వలేదని ఆమె తెలిపింది. జీవీఎంసీ సిబ్బంది తెల్లవారు జామున 5 గంటలకు పోలీసులతో వచ్చి ఇంటిని కూల్చివేశారన్నారు. ఇంటి పన్ను చెల్లించిన పుస్తకం లాక్కున్నారని, ఇంటికి ఉన్న విద్యుత్, కొళాయి కనెక్షన్లు కూడా తొలగించారని ఆవేదన వ్యక్తం చేసింది. అన్ని పన్నులు కడుతున్నా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డున పడేశారని ఆరోపించింది.


పన్నుచెల్లించిన రసీదు చూపుతున్న కుటుంబం

మడ అడవుల ప్రాధాన్యంపై అవగాహన


అతిథి శ్రీనివాస్‌తో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం అంతర్జాతీయ మడ అడవుల పర్యావరణ పరిరక్షణ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కోస్టల్ ఎకోసిస్టమ్ సెంటర్‌తో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐసీఎఫ్‌ఆర్‌ఈ ఇన్‌చార్జి డాక్టర్ టి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మడ అడవుల ప్రాముఖ్యత, స్థిరమైన నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ తీరప్రాంత రక్షణ, జీవ వైవిధ్యంతోపాటు వాతావరణ నియంత్రణలో మడ అడవులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం బోటనీ విభాగాధిపతి డాక్టర్ టి.ఎం.ఎ.నివేదిత మాంగ్రూవ్ మొక్కలను ప్రదర్శించి వాటి ప్రత్యుత్పత్తి విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగం డాక్టర్ కె.లావణ్య, అరుణపద్మ, డాక్టర్ పి.ఎల్.శరణ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎస్సీ, ఎస్టీల చట్టాలు

- దళిత హక్కుల పోరాట సమితి చర్చా కార్యక్రమంలో సీపీఐ నేత జె.వి.సత్యనారాయణమూర్తి

సీతమ్మధార, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా చేసిన చట్టాలు రోజు రోజుకు నిరుపయోగంగా మారుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. రామాటాకీస్ రోడ్డులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం రక్షణ, రాజ్యాంగంలో సెక్యులర్, సోషలిజం పదాల పరిరక్షణ అంశంపై చర్చా కార్యక్రమం, డీహెచ్‌పీఎస్ జిల్లా ఐదో మహాసభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పోరాటాలతోనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆ చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. అనేక మంది ఎస్సీ, ఎస్టీలు ఎలాంటి విచారణ, బెయిలు లేకుండా జైళ్లలో మగ్గుతున్నారని తెలిపారు. కార్పొరేట్లకే ప్రభుత్వం సింహభాగం నిధులను దోచిపెడుతున్నాయని తెలిపారు. హక్కులను హరిస్తే కుర్చీ లాగేస్తామని హెచ్చరిక చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన సిపిఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.లోకనాధం మాట్లాడుతూ రాజ్యాంగం మీద నమ్మకం లేని వారు నేడు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. రాజ్యాంగానికి ఉన్న గౌరవం జాతీయ జెండాపై ఉండాలని దాని స్థానంలో కాషాయం జెండా ముందు పెడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో లౌకిక వాదం, సామ్యవాదానికి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ పెద్ద పీట వేసారని, ఆ రెండింటిని తీసేసే కుట్ర నేడు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు, రాష్ట్ర అధ్యక్షుడు జెవి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బొడ్డు కళ్యాణరావు, ప్రొఫెసర్ అర్జున్, సూరప్పడు, కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, వేదికపై సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బొడ్డు కళ్యాణరావు తదితరులు

మురళీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం నేడు

మురళీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుంది. చక్కెర వ్యాధి, అధిక రక్తపోటు, ఎముకల రుగ్మతలకు వైద్యుడు వంశీధర్ బృందం వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తారని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు భానుప్రకాష్ తెలిపారు. ఎక్కడివారైనా చికిత్సలు పొందవచ్చన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ లేకపోవడంతో అనేక ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవడంతోపాటు ప్రతిరోజూ సాధారణ విధులను నిర్వర్తించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరం కాబట్టి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నగర భౌగోళిక స్థితి, సమస్యలపై అవగాహన కల్పించుకోవడం, ఉదయం, రాత్రివేళ నగరంలో వార్డుల్లో పర్యటనలు కూడా మరోవైపు కొనసాగిస్తున్నానన్నారు. జీవీఎంసీకి మంచి గుర్తింపు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని, కార్పొరేటర్లు, నగరవాసులు తనకు సహకరించాలని ఆయన కోరారు.

వాట్సాప్‌లోనే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

... 5వ పేజీ తరువాయి

అప్‌డేట్ చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి కొనుగోలుదారుని మొబైల్ నంబరు నమోదు చేయాలని అడుగుతుంది. నమోదు చేశాక దానిని వారి దగ్గరున్న ఆధార్ బేస్డ్ సమాచారంతో నిర్ధారించుకుంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, డాక్యుమెంట్ డిజిటల్ స్కానింగ్ జరిగిన తరువాత సిస్టమ్ నుంచి ఆటోమేటిక్‌గా నమోదుచేసిన మొబైల్ నంబరుకు డాక్యుమెంట్ కాపీ వాట్సాప్‌లో వెళ్లిపోతుంది. మొబైల్‌లోనే ఓపెన్ చేసి చూసుకోవచ్చు. తరువాత సదరు వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకోవలసి ఉంటుంది. వాటిని డాక్యుమెంట్ రైటర్లకు గానీ వేరొకరికి గానీ ఇవ్వరు.

స్టీల్ ప్లాంటులో ర్యాండమ్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపడతామని హెచ్చరించింది. దీనిపై కార్మిక, ఉద్యోగ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జీతాలు సక్రమంగా ఇవ్వకపోయినా కష్టపడి పని చేస్తున్నామని, పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడిపిస్తూ లాభాల బాటలోకి తీసుకువస్తున్నామని, అయినా ఇక్కడి సీఎండీ తమను విశ్వసించడం లేదని, అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ఏ సంస్థ అయినా పరస్పర విశ్వాసంతో ముందుకు వెళుతుందని, కానీ ప్రస్తుత ఇన్‌చార్జి సీఎండీ ఒంటెత్తు పోకడలతో ఉద్యోగులు, కార్మికుల ఆత్మాభిమానం దెబ్బతీస్తున్నారని వాపోయారు.

సెప్టెంబరులో మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

అన్ని టెండర్లు పూర్తిచేసి సెప్టెంబరు రెండో వారంలో పనులు ప్రారంభించాలన్నారు. 2026 జూన్, జూలై నాటికి అన్ని రహదారులు అందుబాటులోకి తేవాలన్నారు. జీవీఎంసీ, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, సింహాచలం గిరిప్రదక్షిణ సమయంలో భక్తులు హనుమంతవాక, వెంకోజీపాలెం వద్ద హైవే దాటడానికి ఇబ్బంది పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, భవిష్యత్తులో సమస్య రాకుండా, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆ రెండు చోట్ల వినూత్నంగా ఆలోచించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక-అచ్యుతాపురం రహదారిలో కంచె

... 5వ పేజీ తరువాయి

ఈ జంక్షన్‌లో రహదారి అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా రోడ్డును మూసివేసేందుకు స్టీల్‌ప్లాంటు యాజమాన్యం సిద్ధమైంది.

వేలాది మందికి ఇదే ప్రధాన రహదారి..

స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు, కార్మికులతో పాటు పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, ఫార్మాసిటీ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డును మూసేయడంపై వివాదం నెలకొనడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గాజువాక తహసీల్దార్ బి.శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని ఒక పరిశీలించారు. స్థలానికి సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత యజమానిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి పది గంటలకు ఇనుప బారికేడ్లను పోలీసుల సహకారంతో తొలగించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

పారిశుధ్యంపై గ్రేటర్ కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

శుభ్రం చేయడానికి అవసరమైనంత మంది కార్మికులు లేకపోవడం వల్లనే పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణ జరగడం లేదని కార్మికసంఘాల నేతలు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచూ తనిఖీలు చేయడం ద్వారా వాస్తవ పరిస్థితిని, సమస్యలను గుర్తించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. అందులో భాగంగానే వారం కిందట వీఐపీ రోడ్డులో, ఈనెల 23న డైమండ్ పార్క్, శంకర మఠం రోడ్డులో రాత్రిపూట పారిశుధ్య పనులు పరిశీలించారు. శుక్రవారం రాత్రి పూర్ణామార్కెట్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంటోందని వాపోయారు. కుక్కల నుంచి తమకు రక్షణ కల్పిస్తే విధి నిర్వహణలో మరింత మంచి ఫలితాలు వచ్చేలా పనిచేస్తామని కమిషనర్‌కు వివరించారు. దీంతో సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్‌కు ఫోన్ చేసి పూర్ణామార్కెట్ ప్రాంతంలో కుక్కల సమస్య లేకుండా తక్షణం వాటిని పట్టే కార్యక్రమం చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అందరూ సమర్థంగా విధులు నిర్వర్తిస్తేనే పరిశుభ్ర నగరంగా గుర్తింపు వస్తుందని కమిషనర్ కేతన్‌గార్గ్ పారిశుధ్య కార్మికులకు వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్న కమిషనర్ హామీతో కార్మికులు ఆనందం వ్యక్తంచేశారు.

వైసీపీలో జడ్పీ లొల్లి

... 5వ పేజీ తరువాయి

ఆయనకు సమాచారం ఉండడంతోనే సంతకం కొట్టేశారని చెబుతున్నారు. ఇదిలావుండగా సీసీపై ఫిర్యాదు గురించి వైసీపీ ఫ్లోర్‌లీడర్, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజుకు సమాచారం లేదని తెలిసింది. ఆయనతోపాటు మరి కొందరు సభ్యులు సంతకాలు చేయలేదు. కాగా జిల్లాలో 39 జడ్పీటీసీ స్థానాల్లో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిపి వైసీపీకి 36 మంది సభ్యులు ఉన్నారు. చైర్‌పర్సన్ సుభద్రపై అసంతృప్తితో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన సర్వసభ్య సమావేశాన్ని 22 మంది సభ్యులు బహిష్కరించారు. తరువాత పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని చైర్‌పర్సన్, సభ్యుల మధ్య సయోధ్య కుదిర్చినా అది తాత్కాలికమేనని తాజా ఘటనలతో స్పష్టమైంది. ఫోరం అధ్యక్షుడిగా రాంబాబు స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యాన్ని ఎన్నుకోవడంతో సభ్యుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. అందరం కలిసి మాట్లాడదామని సత్యం చెప్పినా తరువాత ఏమి జరిగిందోగానీ ఆయనే ఫోరం అధ్యక్షుడు అంటూ సభ్యులు వెల్లడించారు. జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఎనిమిది నెలల కాలానికి గౌరవ వేతనం అందగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరో ఆరు నెలల వేతనం అందింది. సుమారు 30 నెలల కాలానికి గౌరవ వేతనం జడ్పీటీసీ సభ్యులకు రాలేదని అనేక పర్యాయాలు ఆవేదన వ్యక్తం చేసినా ఫోరం అధ్యక్షుడు పట్టించుకోలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. అందుకే ఫోరం అధ్యక్షుడిని మార్చుకున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయినట్టేనని ఒక సభ్యుడు వ్యాఖ్యానించారు.

సీబీఐకి విద్యార్థిని కేసు

... 5వ పేజీ తరువాయి

అప్పగించాలని బాలిక తల్లిదండ్రులు ఏపీ హైకోర్టుని ఆశ్రయించారు. దీనిపై ఏపీ, పశ్చిమ బెంగాల్‌లో వేర్వేరుగా కేసులు నమోదైనందున సీబీఐకి అప్పగించాలని తాము ఆదేశించలేమని హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కేసును సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. ప్రైవేటు విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా నిపుణులైన కౌన్సెలర్లను నియమించుకోవాలని ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ అధికారులు విద్యార్థిని కేసు దర్యాప్తు మొదలుపెడితే తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని, అప్పట్లో ఈ కేసు దర్యాప్తుతో సంబంధం కలిగిన అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఉత్తరాంధ్ర నేతలకు అధిక ప్రాధాన్యం

- సమస్యల పరిష్కారంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పటినప్పటి నుంచి ఉత్తరాంధ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ, ముఖ్యనాయకుల భాగస్వామ్యంతో ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని ప్రజల ఆశయాలు, అవసరాలు బాగా అర్థంచేసుకున్న నాయకత్వం చంద్రబాబునాయుడిదే అన్నారు. ప్రజలు మెచ్చుకున్న నాయకులైన కింజరాపు రామ్మోహన్‌నాయుడునుకేంద్రమంత్రిగా, అశోక్ గజపతిరాజును గవర్నర్‌గా పదవులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే విద్య, వైద్యం, రవాణా రంగాల్లో పెట్టుబడులు ఉత్తరాంధ్రకు రాబట్టేందుకు ముఖ్యమంత్రి స్వయంగా కృషి చేస్తున్నారన్నారు. సీమాంధ్ర, ఉత్తరాంధ్ర సమాన అభివృద్ధి కోసం గడచిన కొన్ని రోజులుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు మైలురాళ్లగా నిలుస్తాయని శ్రీభరత్‌పేర్కొన్నారు.

15వ వార్డులో సమస్యల పరిష్కారానికి సహకరించండి

- మేయర్ పీలా శ్రీనివాసరావుకు కార్పొరేటర్ శ్రీవిద్య వినతి

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డులో పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఆ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీలో మేయర్ చాంబర్‌లో శనివారం ఆయనను కలిసి సమస్యలను వివరించారు. వార్డులో ప్రధానంగా అండర్‌గ్రౌండ్ సమస్య ఉందని మేయర్‌కు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను పునరుద్ధరించామని, కానీ హెచ్‌బీకాలనీ, ఉమానగర్, దుర్గానగర్ ప్రాంతాలలో ఈ సమస్య కొనసాగుతుందన్నారు. జేఆర్‌నగర్, సీతమ్మధార, అంబేడ్కర్‌నగర్, ఎంఎంటీసీ కాలనీ ప్రాంతాలలో రోడ్డులు గోతులు ఏర్పడి వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మేయర్‌కువివరించారు.

ఏపీపీఎస్సీ చైర్మన్‌తో ఎమ్మెల్సీ చిరంజీవిరావు భేటీ

సిరిపురం , జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్ చైర్మన్, సెక్రటరీలను ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవరావు కలిసి పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్‌పై ప్రణాళిక ప్రారంభించాలని, గ్రూప్-2 అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసి ఫలితాలు ప్రకటించాలని, ఎఫ్‌బీవో, ఏబీవో, ఎఫ్ఎస్‌వో రెండు పరీక్షలూ ఒకే తేదీన జరగనున్నట్టు ప్రస్తావించగా చైర్మన్ స్పందిస్తూ అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా ఒకే పరీక్షా కేంద్రం కేటాయిస్తామని చెప్పారని చిరంజీవిరావు తెలిపారు. ఏపీపీఎస్సీ నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు, సకాలంలో ఫలితాలు, సిలబస్, ఏపీపీఎస్సీ సభ్యుల అర్హతలు తదితర అంశాలపై చర్చించడం జరిగిందని చిరంజీవిరావు తెలిపారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు బ్రాయ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ప్రత్యేక కార్యాచరణతో ఆక్రమణల తొలగింపు

- ఆపరేషన్ లంగ్స్ లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసెస్ చేపట్టిన జీవీఎంసీ
- ఒక్కరోజులోనే మొత్తం 15 రిజర్వు ఓపెన్ స్పేస్‌లలో ఆక్రమణల తొలగింపు
- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు


ఆక్రమణల తొలగింపు చేపడుతున్న దృశ్యం


ఆక్రమణలను తొలగించిన దృశ్యం

సిరిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని లే అవుట్‌లలో ఆక్రమణకు గురైన ఓపెన్ స్పేస్‌లను ఆపరేషన్ లంగ్స్ లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసెస్‌తో చేపట్టిన కార్యాచరణలో భాగంగా శనివారం నగరంలోని 15 రిజర్వు ఓపెన్‌స్పేస్‌లలోని ఆక్రమణలు గుర్తించి వాటిని పట్టణ ప్రణాళిక విభాగం తొలగించినట్టు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. నగరంలో ఖాళీ స్థలాలు, పార్కుల ఆక్రమణ, వాటి సంరక్షణ గురించి ఈ నెల 24న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. నగరంలోని అన్ని జోన్లలో లే అవుట్‌లలో ఉన్న ఓపెన్ స్పేస్‌లను ఆక్రమణలకు గురవుతున్నందున వాటిని గుర్తించి పరిరక్షించే దిశగా ప్రత్యేక ఆపరేషన్ కార్యక్రమం చేపట్టి ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ప్రత్యేక బృందం శనివారం ఆపరేషన్ లంగ్స్ లైఫ్ టు అర్బన్ పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. ఓపెన్ స్పేస్ ఆక్రమణల తొలగింపులు జోన్-1లో సంగివలస, జోన్-2లో ప్రశాంతినగర్, టీచర్ లేఅవుట్, డీఆర్కే రాజు టౌన్‌షిప్ లే అవుట్, కొమ్మాది, గ్లోబల్ స్కూల్ వెనుక వైపు కొత్తపాలెం, మధురవాడ, ఏఎస్‌ఆర్ నగర్, జోన్-3లో ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీ లే అవుట్, నక్కవానిపాలెం లేవుట్, జోన్ 5లో మర్రిపాలెం లే అవుట్, జోన్-6లో లంకెలపాలెం, శివాజీనగర్ లే అవుట్ గోదావరి టౌన్‌షిప్ నరవతో కలిపి మొత్తం 15 రిజర్వు ఓపెన్ స్పేస్‌లలో ఆక్రమణలను గుర్తించి సంబంధిత పోలీసుల సహకారంతో సదరు ఆక్రమణలను ఒక్క రోజులోనే తొలగించడం జరిగిందన్నారు. ఈ ఆక్రమణల తొలగింపులో సంబంధిత జోనల్ కమిషనర్లు, సహాయ ప్రణాళికాధికారులు, ప్రణాళికా విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొనడం జరిగిందన్నారు.

సైనికుల సేవలు చిరస్మరణీయం

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి


కార్గిల్ స్కిట్ చేసిన విద్యార్థులతో సీపీ శంఖబ్ర బాగ్చి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దేశానికి సైనికులు అందించే సేవలు చిరస్మరణీయమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం 26వ కార్గిల్ విజయ్ దివాస్ పేరిట యాక్మి, ఏపీ సైనిక్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సైనికులకు అందరం సెల్యూట్ చేయాలన్నారు. కార్గిల్ యుద్ధంతో భారతదేశ సైనిక బలం ఎలాంటిదో శత్రుదేశాలకు రుచి చూపించారన్నారు. సిందూర్‌తో టెక్నాలజీలో భారతదేశం ఎంత ఎత్తున ఉందో ప్రపంచ దేశాలకు చాటి చెప్పామన్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ సరిహద్దుల్లో సైనికులు కళ్లార్పకుండా కాపలా కాయడం వల్లే మనం ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నామన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల కుటుంబాలకు అండగా నిలబడడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళులన్నారు. దేశ సరిహద్దుల్లో పని చేస్తున్న సైనికుల కుటుంబసభ్యులకు గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మెమొంటోలు ప్రదానం చేశారు. యుద్ధంలో అమరులైన జవానుల కుటుంబసభ్యులకు సత్కరించారు. ఈ సందరర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో ఏపీ సైనిక సంక్షేమశాఖ డైరక్టర్ వి.వెంకట్‌రెడ్డి, యాక్మి ప్రతినిధులు ప్రతాప్‌కుమార్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికుల తల్లులు, భార్యలకు సత్కారం

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని కార్యేషు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొత్త వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాలులో శ్రీకాకుళం చెందిన అమరవీరులైన 25 మంది వీర సైనికుల మాతృమూర్తులు, సతీమణులను ఘనంగా సత్కరించారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, బీజేపీ యువ మహిళా నేత శ్యామలదీపిక ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్యేషు స్వచ్ఛంద సంస్థ ద్వారా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అమరులైన సైనికుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రక్షణ రంగంలో సైనికుల త్యాగం మరువలేనిదని, వారి కుటుంబ సభ్యులను గౌరవించుకోవడం మన అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యేషు స్వచ్ఛంద సంస్థ ప్రజా సంక్షేమ ధ్యేయంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి ఏడాది ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్యేషు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇందిరా ప్రియదర్శిని, శిరీష, జయ, కీర్తి, మాదురి తదితరులు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న అమర వీరుల తల్లులు, సతీమణులు

ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ


ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో సీపీ శంకబ్రత బాగ్చి

ఎంవీపీ కాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. అవినీతి ఆరోపణలు రాకుండా చూసుకోవాలని, పిర్యాదుదారులకు తగిన మర్యాద ఇవ్వాలని ఆదేశించారు. కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సీఐ మురళీని సూచించారు.

రౌడీ షీటర్ల ఫొటోలు రంగులు వెలిసిపోయి, అస్పష్టంగా ఉండడంతో 'ఇదేమిటి..' అంటూ ప్రశ్నించారు. తాజా ఫొటోలు పెట్టాలని ఆదేశించారు. స్టేషన్‌లో సౌకర్యాలు, సమస్యలను సీఐ మురళీని అడిగి తెలుసుకున్నారు.

ఏయూ లా కళాశాలలో స్వచ్ఛభారత్


ట్రాక్టర్‌పై చెత్తను తరలిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం ప్రేరణాత్మక ప్రసంగంతో ప్రారంభమైన కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేసి, కళాశాలలోని సీలింగ్ ఫ్యాన్లు, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, బహిరంగ స్థలాన్ని శుభ్రపరచడం ద్వారా పరిశుభ్రతా డ్రైవన్‌ను చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది రమణ, విశ్వనాథ్, రాజశేఖర్‌పాల్గొన్నారు.

సీఎంఎఫ్‌ఆర్‌ఐ, సీఐఎఫ్‌టీలను సందర్శించిన కలెక్టర్

బీచ్ రోడ్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సీఎంఎఫ్‌ఆర్‌ఐ, సీఐఎఫ్‌టీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలో పని చేసే ఈ రీసెర్చ్ సంస్థలు నిర్వహించే కార్యకలాపాలను పరిశీలించారు. పరిశోధన అంశాలు, ప్రయోగాలు, సాంకేతిక పరిజ్ఞానంపై సాగే వినూత్న పరిశోధనల గురించి అక్కడి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల చేపలు, చేప పిల్లలు ఉత్పత్తి, లైవ్ ఫీడ్ యూనిట్లను పరిశీలించారు. సముద్ర మత్స్యసంపద అభివృద్ధికి నిర్వహిస్తున్న పరిశోధనలు, కార్యకలాపాల గురించి ప్రిన్సిపాల్ సైంటిస్ట్, రీజనల్ సెంటర్ హెడ్ డా.జోకిజాకుదాన్ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మధు, డాక్టర్ శ్రీధర్, మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో


శ్రీకృష్ణాపురం బీఆర్టీఎస్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ఆరిలోవ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అడవివరం నుంచి హనుమంతవాక జంక్షన్ మార్గమధ్యంలోని శ్రీకృష్ణాపురం బీఆర్టీఎస్ రోడ్డులో శనివారం ఉదయం డివైడర్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో అక్కడ ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవింగ్ నేర్చుకునే క్రమంలో ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

అశోక్‌గజపతిరాజుకు బీజేపీ ఏపీ నేతల శుభాకాంక్షలు


గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌గజపతిరాజును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

పెదవాల్తేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురష్కరించుకొని అశోక్‌గజపతిరాజును శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్ బాబు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను శనివారం మర్యాద పూర్వకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ శ్రీనివాసబాబు కలిశారు.

బోధనేతర విధుల నుంచి తప్పించండి

- డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల వినూత్న నిరసన


మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులపై భోధనేతర పనులు భారం తగ్గించి బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ జీతాలను చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) కోరింది. శనివారం యూటీఎఫ్ జిల్లా కమిటీ నేతులు జిల్లా విద్యాశాఖాదికారి కార్యాలం ఎదుట పెద్ద ఎత్తున మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియి పూర్తఇ నెల రోజులు అయినప్పటికీ వేలాదిమంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలనే స్పృహ అదికారులకు లేకపోవడం అన్యాయమన్నారు. ఇది ఉపాధ్యాయుల పట్ల అధికారులు చూపుతున్న వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై భోదనేతర పనులు పూర్తిగా తగ్గించాలని, ఉపాధ్యాయుల సెలవులు వినియోగించే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధించడం సరైన చర్య కాదన్నారు. విశాఖ జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి టిఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రతి పనిని ఉపాధ్యాయులు గంటల వ్యవధిలోనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడం తగదన్నారు. దాదాపు 25 వేల మంది ఉపాధ్యాయులు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు, నేతలు ప్రభాకరరావు, కోశాధికారి కె.రాంబాబు,జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రియాజ్ అహ్మద్, టి.జగన్, జిల్లా ఎడిట్ కమిటీ సభ్యులుకుమారి, గాజువాక మండల శాఖ అధ్యక్షులు ఇమంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ఆచరణలో సాకారం కావాలి

- ఏయూ వీసీ రాజశేఖర్


దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, పలువురు ఆచార్యులు, ఏయూ అధికారులు

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలను గౌరవించడంపై యువతరానికి అవగాహన కల్పించడం, ఈ దిశగా వారిని చైతన్య పరచడం ఎంతో అవసరమని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, సీఐఐ ఇండియన్ విమెన్ నెట్‌వర్క్ సంయుక్తంగా విమెన్ ఎట్ వర్క్ ప్లేస్ పాలిసీస్, ప్రొసెసెస్ ఫర్ ఇంక్లూషన్ అంశంపై శనివారం నిర్వహించిన సదస్సును వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమ ప్రాతినిధ్యం కల్పించడం ఎంతో అవసరమని, ఇది కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపితే సత్ఫలితాలు వస్తాయన్నారు. మహిళలకు సంబంధించిన విదాన నిర్ణయాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన జరపాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కార్పొరేట్ సంస్థలలో మహిళలకు కొంత మెరుగైన పరిస్థితులు, వసతులు లభిస్తున్నాయని, ఈ తరహాలో ప్రభుత్వ సంస్థల్లో సైతం అవసరమైన సదుపాయాలను కల్పించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ రాజ్యాంగం మహిళల రక్షణకు, సమాజంలో సమ్మిళితం చేయడానికి కల్పించిన ప్రాధాన్యతలను వివరించారు. డాక్టర్ దుర్గాబాయ్ దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సంచాలకులు ఆచార్య ఏ.పల్లవి, ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఆంధ్రప్రదేశ్ శాఖ వైస్ చైర్మన్ డాక్టర్ పి.ఉష పాల్గొన్నారు.

అశోక్‌కు గవర్నర్ గిరీ ఉత్తరాంధ్రకు దక్కిన గౌరవం

- వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

వెంకోజీపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ఉత్తరాంధ్రకు చెందిన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్ పదవి లభించడం ఉత్తరాంధ్ర ప్రజలందరికీ గర్వకారణమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం దక్కిందని, ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలోనే కాదు, ఇక్కడి నాయకుల్ని ప్రోత్సహించడంలో కూడా టీడీపీ ముందు ఉంటుందనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర నుంచి అశోక్‌గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా పదవి రావడం, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర విమానయాన మంత్రిని చేయడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం టీడీపీకే సాధ్యమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో విద్యా సంస్థల స్థాపనకు, ఆలయాలకు వేల ఎకరాలను ధారదత్తం చేసిన అశోక్ గజపతిరాజును గత వైసీపీ ప్రభుత్వం మానసిక క్షభకు గురి చేసిందన్నారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రను దోచుకోవటమే తప్ప ఇక్కడ నాయకులకు గౌరవ ఇవ్వలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు.

టీడీపీ హయాంలోనే ఉత్తరాంధ్రకు న్యాయం : పట్టాభిరామ్

పెదవాల్తేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్ పదవి రావడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. శనివారం ఉషోదయ జంక్షన్ వద్ద తన కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు.

డాక్టర్ నూకల ఆర్‌ఎల్‌ఎల్ సౌజన్యకు డాక్టరేట్


ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకుంటున్న సౌజన్య

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధకురాలు నూకల ఆర్‌ఎల్‌ఎల్ సౌజన్యకు డాక్టరేట్ లభించింది. విభాగ ప్రొఫెసర్ టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో 'పాఠశాల స్థాయిలో విద్యా సంబంధిత పథకాలు, సమర్థవంతమైన అమలు' అనే అంశంపై జరిపిన పరిశోధనకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ చేతుల మీదుగా సౌజన్య డాక్టరేట్ ఉత్తర్వులను అందుకున్నారు. విద్యా సంబంధిత సంక్షేమ పథకాలను మరింత విస్తృతం చేయడానికి, బలోపేతం చేస్తూ విద్యార్థులకు చేరువ చేసేందుకు అవసరమైన సూచనలను పరిశోధనలో సౌజన్య అందించిన తీరును పలువురు అభినందించారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఎన్ఎంయూఏ నిరసన


మద్దిలపాలెం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ ప్రతినిధులు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలోని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నాయకులు, కార్మికులు శనివారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విజయవాడలోని గవర్నర్‌పేట-2 డిపోలో, పాత బస్టాండులోని ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను నిరసిస్తూ విశాఖ రీజియన్‌లోని ఏడు డిపోల ఎన్ఎంయూఏ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం, గాజువాక, సింహాచలం, స్టీల్ సిటీ డిపోల వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్ఎంయూఏ జిల్లా కార్యదర్శి పిళ్లా శంకరరావు, అధ్యక్షుడు పీఎస్ మూర్తి, డిపో కార్యదర్శులు పాలపర్తి చిన్నా(మద్దిలపాలెం), ఎంవీఆర్ మూర్తి(విశాఖపట్నం), ఆర్.వసంతరావు (వాల్తేరు), జేఎస్ఎన్ రాజు (సింహాచలం), సాయిరామ్ (స్టీల్ సిటీ), బంగారుబాబు(మధురవాడ), తదితరులు పాల్గొన్నారు.

గెడ్డపై వృథా నిర్మాణం

» మూడు వైపులా కాలనీ రోడ్లు ఉన్నా మరో కొత్త కల్వర్టు మార్గానికి భూమిపూజ
» ఉడా కాలనీలో వెచ్చిస్తున్న జీవీఎంసీ నిధులు


రక్షణ గోడ లేని ఉడాకాలనీ రోడ్డు మలుపులోని గెడ్డ

మాధవధార, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ నిధులను నిరుపయోగ నిర్మాణాలకు కేటాయిస్తూ మాధవధార ఉడాకాలనీలో కొత్త కల్వర్టు పనులను ఆరంభించారు. కమ్యూనిటీ హాలు బస్టాపు నుంచి ఎగువన ఉన్న ఎల్ఐజీ ఫేజ్-2, ఎంఐజీ ఇళ్ల వద్దకు చేరడానికి ప్రతి ఇంటి ముందు నుంచి 24 అడుగుల బీటీ రోడ్డు ఉంది. 60 అడుగుల 48ఎ బస్‌రూట్ పక్కనే ఉన్న ఈ నివాస సముదాయాల కోసం 2000 సంవత్సరంలో వీఎంఆర్డీఏ 61 ఎకరాల 12 సెంట్ల స్థలంలో వేసిన లేఅవుట్ పూర్తి వసతులతో అందుబాటులో ఉంది. కాలనీలోని కమ్యూనిటీ హాలు, షాపుల కోసం 49 సెంట్ల భూమిని వీఎంఆర్డీఏ విడిచిపెట్టి సువిశాల మాధవధార కొండ పక్కగా 48ఎ బస్ రూట్‌ను కలుపుతూ నివాసితులకు స్థలాల్ని కేటాయించారు. ప్రతి ఇంటి ముందు నుంచి దారి ఉండేలా లేఅవుట్ రూపొందించారు. ఖాళీ తారురోడ్ల నిర్మాణాలకే 17 ఎకరాల 35 సెంట్ల భూమి విడిచి పెట్టినా, ఇప్పుడు కొత్తగా మళ్లీ గెడ్డలను మింగేస్తూ కల్వర్టులు కడుతున్నారు. మాధవధార ఉడాకాలనీలోని వ్యక్తిగత ఇళ్లన్నీ ఇప్పుడు అపార్టుమెంట్లుగా మారుతూ వస్తున్నా వాహనాల పార్కింగ్‌కు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అప్పట్లోనే సువిశాల రహదారులు వేశారు.

బిల్డర్ స్కెచ్.. అధికారులు సై: కాలనీలో ఇపుడు గ్యాస్ గోడౌన్ రోడ్డులో ఓ బిల్డరు తన కట్టడానికి మార్కెట్ లేదని తన నిర్మాణం పక్కనే ఉన్న ఉడాకాలనీ ప్రధానగెడ్డ మీదుగా కల్వర్టు వేసి అవతలివైపు 40 అడుగుల రోడ్డుకు అనుసంధానిస్తానని భవనం కట్టక ముందే బ్రోచర్లలో వేసి బిల్డింగ్‌లో ఫ్లాట్స్ కొనేవారికి చూపించాడు. దీంతో జీవీఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటరు ఓ ప్రణాళిక ప్రకారం అదే భవనానికి మూడు వైపులా రోడ్డు ఉన్నా ఇప్పుడు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుతో కొత్త కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేయించారు. కాలనీలో మరే భవనానికి లేని ప్రత్యేక వెసులుబాటు కోసం లోకల్‌గా ఉండే 10 మందితో సంతకాలు చేయించి నిర్మాణం తమకు అవసరమని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయానికి తప్పుడు నివేదిక చేరవేశారు. జీవీఎంసీ కూడా పరిశీలన లేకుండా నిధులు కేటాయించింది. ఎమ్మెల్యే వచ్చి పనులు ఆరంభించారు. సదరు బిల్డరు కట్టడాన్ని చేరడానికి కొండ పక్కగా ఓ దారి, మాధవధార కమ్యూనిటీ హాలు ముందు నుంచి మరో దారి, గ్యాస్ గోడౌన్ నుంచి ఇంకోటి ఉన్నాయి. పెద్ద పెద్ద లారీలు, పొక్లయిన్లు వెళ్లి పనిచేసినా ఇపుడు తీవ లేదంటూ వినతి పెట్టారు. పాత కల్వర్టుకు పక్కగా ఉన్న రోడ్డుపై రక్షణ లేక ఓసారి రాత్రి వేళ కారు రివర్స్ చేస్తుండగా గెడ్డలో పడిపోయింది. పిల్లలు ఆడుకునే పద్మావతి పార్కును ఆనుకొని ఉన్న ఈ గెడ్డ పక్కగా ఉన్న ఇళ్ల యజమానులు ఇలా క్రమంగా గెడ్డను ఆక్రమిస్తూ కట్టడాలు చేపడుతున్నారు. మరోవైపు రోడ్డు మలుపులో ఉన్న పాత కల్వర్టు వద్ద గెడ్డ ప్రమాదాలకు నెలవుగా మారింది. అయినా, ఇక్కడ రక్షణగోడ ప్రతిపాదన గానీ, ఆ దిశగా అభివృద్ధి పనులు గానీ లేవు. ఇప్పుడు మాత్రం ఓ బిల్డరు తన 5 అంతస్థుల నిర్మాణానికి రాజమార్గంలో ప్రభుత్వ నిధుల్ని తన సొంత వ్యాపారానికి అత్యంత తెలివిగా వేయించగలిగారు. స్థానిక కాలనీవాసులు మాత్రం ఈ వృథా పనుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజోపయోగ నిర్మాణాలకు జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమయం, ప్రభుత్వ ధనం కేటాయించాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ఓ బిల్డింగ్‌కి మాత్రమే ఉపయోగపడేలా నిర్మిస్తున్న కొత్త కల్వర్టు

మురళీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం నేడు

మురళీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుంది. చక్కెర వ్యాధి, అధిక రక్తపోటు, ఎముకల రుగ్మతలకు వైద్యుడు వంశీధర్ బృందం వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తారని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు భానుప్రకాష్ తెలిపారు. ఎక్కడివారైనా చికిత్సలు పొందవచ్చన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ లేకపోవడంతో అనేక ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవడంతోపాటు ప్రతిరోజూ సాధారణ విధులను నిర్వరించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరం కాబట్టి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నగర భౌగోళిక స్థితి, సమస్యలపై అవగాహన కల్పించుకోవడం, ఉదయం, రాత్రివేళ నగరంలో వార్డుల్లో పర్యటనలు కూడా మరోవైపు కొనసాగిస్తున్నానన్నారు. జీవీఎంసీకి మంచి గుర్తింపు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని, కార్పొరేటర్లు, నగరవాసులు తనకు సహకరించాలని ఆయన కోరారు.

వాట్సాప్‌లోనే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

... 5వ పేజీ తరువాయి

అప్‌డేట్ చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి కొనుగోలుదారుని మొబైల్ నంబరు నమోదు చేయాలని అడుగుతుంది. నమోదు చేశాక దానిని వారి దగ్గరున్న ఆధార్ బేస్డ్ సమాచారంతో నిర్ధారించుకుంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, డాక్యుమెంట్ డిజిటల్ స్కానింగ్ జరిగిన తరువాత సిస్టమ్ నుంచి ఆటోమేటిక్‌గా నమోదుచేసిన మొబైల్ నంబరుకు డాక్యుమెంట్ కాపీ వాట్సాప్‌లో వెళ్లిపోతుంది. మొబైల్‌లోనే ఓపెన్ చేసి చూసుకోవచ్చు. తరువాత సదరు వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకోవలసి ఉంటుంది. వాటిని డాక్యుమెంట్ రైటర్లకు గానీ వేరొకరికి గానీ ఇవ్వరు.

స్టీల్ ప్లాంటులో ర్యాండమ్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపడతామని హెచ్చరించింది. దీనిపై కార్మిక, ఉద్యోగ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జీతాలు సక్రమంగా ఇవ్వకపోయినా కష్టపడి పని చేస్తున్నామని, పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడిపిస్తూ లాభాల బాటలోకి తీసుకువస్తున్నామని, అయినా ఇక్కడి సీఎండీ తమను విశ్వసించడం లేదని, అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ఏ సంస్థ అయినా పరస్పర విశ్వాసంతో ముందుకు వెళుతుందని, కానీ ప్రస్తుత ఇన్‌చార్జి సీఎండీ ఒంటెత్తు పోకడలతో ఉద్యోగులు, కార్మికుల ఆత్మాభిమానం దెబ్బతీస్తున్నారని వాపోయారు.

సెప్టెంబరులో మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

అన్ని టెండర్లు పూర్తిచేసి సెప్టెంబరు రెండో వారంలో పనులు ప్రారంభించాలన్నారు. 2026 జూన్, జూలై నాటికి అన్ని రహదారులు అందుబాటులోకి తేవాలన్నారు. జీవీఎంసీ, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, సింహాచలం గిరిప్రదక్షిణ సమయంలో భక్తులు హనుమంతవాక, వెంకోజీపాలెం వద్ద హైవే దాటడానికి ఇబ్బంది పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, భవిష్యత్తులో సమస్య రాకుండా, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆ రెండు చోట్ల వినూత్నంగా ఆలోచించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక-అచ్యుతాపురం రహదారిలో కంచె

... 5వ పేజీ తరువాయి

ఈ జంక్షన్‌లో రహదారి అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా రోడ్డును మూసివేసేందుకు స్టీల్‌ప్లాంటు యాజమాన్యం సిద్ధమైంది.

వేలాది మందికి ఇదే ప్రధాన రహదారి..

స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు, కార్మికులతో పాటు పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, ఫార్మాసిటీ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డును మూసేయడంపై వివాదం నెలకొనడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గాజువాక తహశీల్దార్ బి.శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని ఒక పరిశీలించారు. స్థలానికి సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత యజమానిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి పది గంటలకు ఇనుప బారికేడ్లను పోలీసుల సహకారంతో తొలగించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

పారిశుధ్యంపై గ్రేటర్ కమిషనర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

శుభ్రం చేయడానికి అవసరమైనంత మంది కార్మికులు లేకపోవడం వల్లనే పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణ జరగడం లేదని కార్మికసంఘాల నేతలు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచూ తనిఖీలు చేయడం ద్వారా వాస్తవ పరిస్థితిని, సమస్యలను గుర్తించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. అందులో భాగంగానే వారం కిందట వీఐపీ రోడ్డులో, ఈనెల 23న డైమండ్ పార్క్, శంకరమఠం రోడ్డులో రాత్రిపూట పారిశుధ్య పనులు పరిశీలించారు. శుక్రవారం రాత్రి పూర్ణామార్కెట్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంటోందని వాపోయారు. కుక్కల నుంచి తమకు రక్షణ కల్పిస్తే విధి నిర్వహణలో మరింత మంచి ఫలితాలు వచ్చేలా పనిచేస్తామని కమిషనర్‌కు వివరించారు. దీంతో సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్‌కు ఫోన్ చేసి పూర్ణామార్కెట్ ప్రాంతంలో కుక్కల సమస్య లేకుండా తక్షణం వాటిని పట్టే కార్యక్రమం చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అందరూ సమర్థంగా విధులు నిర్వర్తిస్తేనే పరిశుభ్ర నగరంగా గుర్తింపు వస్తుందని కమిషనర్ కేతన్‌గార్గ్ పారిశుధ్య కార్మికులకు వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్న కమిషనర్ హామీతో కార్మికులు ఆనందం వ్యక్తంచేశారు.

వైసీపీలో జడ్పీ లొల్లి

... 5వ పేజీ తరువాయి

ఆయనకు సమాచారం ఉండడంతోనే సంతకం కొట్టేశారని చెబుతున్నారు. ఇదిలావుండగా సీఈపై ఫిర్యాదు గురించి వైసీపీ ఫ్లోర్‌లీడర్, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజుకు సమాచారం లేదని తెలిసింది. ఆయనతోపాటు మరికొందరు సభ్యులు సంతకాలు చేయలేదు. కాగా జిల్లాలో 39 జడ్పీటీసీ స్థానాల్లో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిపి వైసీపీకి 36 మంది సభ్యులు ఉన్నారు. చైర్‌పర్సన్ సుభద్రపై అసంతృప్తితో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన సర్వసభ్య సమావేశాన్ని 22 మంది సభ్యులు బహిష్కరించారు. తరువాత పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని చైర్‌పర్సన్, సభ్యుల మధ్య సయోధ్య కుదిర్చినా అది తాత్కాలికమేనని తాజా ఘటనలతో స్పష్టమైంది. ఫోరం అధ్యక్షుడిగా రాంబాబు స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యాన్ని ఎన్నుకోవడంతో సభ్యుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. అందరం కలిసి మాట్లాడదామని సత్యం చెప్పినా తరువాత ఏమి జరిగిందోగానీ ఆయనే ఫోరం అధ్యక్షుడు అంటూ సభ్యులు వెల్లడించారు. జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఎనిమిది నెలల కాలానికి గౌరవ వేతనం అందగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరో ఆరు నెలల వేతనం అందింది. సుమారు 30 నెలల కాలానికి గౌరవ వేతనం జడ్పీటీసీ సభ్యులకు రాలేదని అనేక పర్యాయాలు ఆవేదన వ్యక్తం చేసినా ఫోరం అధ్యక్షుడు పట్టించుకోలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. అందుకే ఫోరం అధ్యక్షుడిని మార్చుకున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయినట్టేనని ఒక సభ్యుడు వ్యాఖ్యానించారు.

సీబీఐకి విద్యార్థిని కేసు

... 5వ పేజీ తరువాయి

అప్పగించాలని బాలిక తల్లిదండ్రులు ఏపీ హైకోర్టుని ఆశ్రయించారు. దీనిపై ఏపీ, పశ్చిమ బెంగాల్‌లో వేర్వేరుగా కేసులు నమోదైనందున సీబీఐకి అప్పగించాలని తాము ఆదేశించలేమని హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కేసును సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. ప్రైవేటు విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా నిపుణులైన కౌన్సెలర్లను నియమించుకోవాలని ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ అధికారులు విద్యార్థిని కేసు దర్యాప్తు మొదలుపెడితే తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని, అప్పట్లో ఈ కేసు దర్యాప్తుతో సంబంధం కలిగిన అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

వ్యూహాత్మకంగా మెట్రో ప్రాజెక్టుకు భూసేకరణ


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూముల సేకరణలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్రోతో పాటు విశాఖపట్నం-గోపాలపట్నం మధ్య రైల్వే అధికారులు 3, 4 లైన్ల నిర్మాణం చేపడుతున్నారని, అలాగే పెందుర్తి-సింహాచలం నార్త్ స్టేషన్ మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, వడ్లపూడి జంక్షన్, గాజువాక-కణితి రోడ్డు, దువ్వాడ-సింహాచలం లైన్ల మధ్యలో చేపట్టే పనులకు కూడా భూమి అవసరమని, వాటిపై కూడా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణలో ప్రభావితమయ్యే కుటుంబాలకు పునరావాసం, పునర్నిర్మాణ పథకాలపైనా చర్చించారు. ప్రైవేటు భూమి 9.22 ఎకరాలు సేకరించాల్సి ఉందని, నిబంధనల ప్రకారం ముందుకువెళ్లాలన్నారు. నిర్దేశిత సమయాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్ఓ భవానీ శంకర్, ఆర్డీఓ శ్రీలేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పర్యాటక శాఖ అధికారిణి మాధవి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై 30న సదస్సు

డాబాగార్డెన్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక సదస్సు నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఏయూ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో సదస్సు జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనుల కోసం మేయర్‌కు వినతి

అక్కయ్యపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు నగర మేయర్ పీలా శ్రీనివాస్‌ను శనివారం కలిసి వినతిపత్రంసమర్పించారు.


మేయర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రావణి

చిన్నూరులో శంకుస్థాపన

గ్రేటర్ 26వ వార్డు చిన్నూరు మసీద్ దగ్గర రూ. 16.78 లక్షల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జి నిర్మించేందుకు శనివారం టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ ముక్కా శ్రావణి శంకుస్థాపన చేశారు. చిన్నూరు గ్రామాభివృద్ధిలో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, నూతన బ్రిడ్జి నిర్మించేందుకు పనులు ప్రారంభించినట్లు శ్రావణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు బండి కన్నా, బీజేపీ నాయకుడు నాగడమూడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం స్టేషన్‌కు ఇద్దరు ప్రొబేషనరీ ఎస్ఐలు


ఎస్ఐలకు సూచనలు చేస్తున్న సీఐ రవికుమార్

కంచరపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు మరో ఇద్దరు ప్రొబేషనరీ ఎస్ఐలను కేటాయించడంతో వీరు స్టేషన్‌కు విచ్చేశారు. వీరికి సీఐ రవికుమార్ పలు సూచనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి మేరంగి అరుణ, విజయనగరం జిల్లా నుంచి ఎస్.అజయ్‌కుమార్‌లు 2024-25 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు. వీరిని కంచరపాలెం స్టేషన్‌కు కేటాయిస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశాలు జారీ చేశారు. వీరిద్దరూ ప్రొబెషన్‌లో భాగంగా ఆరు నెలలు కంచరపాలెం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తారు.

గుండె చికిత్సలు నిలిచిపోవడంపై వైసీపీ నిరసన


కేజీహెచ్ అధికారులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో గుండె శస్త్ర చికిత్సలకు అవసరమైన యంత్రాల కొనుగోలుకు వెంటనే నిధులు కేటాయించాలని మాజీ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. యంత్ర పరికరాలు లేక ఏడు నెలలుగా శస్త్రచికిత్సలు నిలిచిపోవటంతో శనివారం కేజీహెచ్ ఓపీ గేటు వద్ద మాస్కులు ధరించి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి రూ.20 వేల చెక్కును సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి అందజేశారు. అనంతరం వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో గుండె శస్త్రచికిత్సలు నిలిచిపోతే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లుమూసుకున్నారని, కేవలం రూ.3 కోట్లు కేటాయించకపోవటం దుర్మార్గమన్నారు. వైద్యం అందక అనేక మంది పేదలు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కలెక్టర్ ఏంచేస్తున్నారు? తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలని గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎంపీ కోటా, సీఎస్ఆర్ నిధులు కేజీహెచ్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు జాన్‌వెస్లీ, పీతల వాసు, కోరాడ సురేష్, దశమంతుల మాణిక్యాలరావు, చిన్ని, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో జవాను మృతికి ఎమ్మెల్యే వంశీకృష్ణ సంతాపం


జవాను కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జ్ఞానాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన జ్ఞానాపురం వాసి ఆర్మీ జవాను ఆంథోని రాజు పార్థివదేహానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం నివాళులర్పించారు. దేశ సేవ చేసిన జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అలానే 34వ వార్డులో మృతి చెందిన జనసైనికుడు ఉమ్మడి సతీష్ మృతికి ఎమ్మెల్యే సంతాపం తెలిపారు.

కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళి


ప్రభుత్వ మహిళా కళాశాలలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు


సెయింట్ జోసెఫ్ కళాశాలలో విద్యార్థినికి బహుమతి ఇస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో భాగంగా ప్రాణాలర్పించిన కార్గిల్ అమరవీరులకు విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తూ శనివారం కళాశాలలోని కార్గిల్ విజయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.మంజుల అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో దేశభక్తి, సైనికులపై గౌరవం, సమాజ సేవ పట్ల చైతన్యం కలిగిస్తాయన్నారు. నాటి విజయంపై ఎన్‌సీసీ కేడెట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్‌సీసీ కేడెట్లు కార్గిల్ విజయాన్ని స్కిట్స్ రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డా కె.గీతాంజలి, ఆర్.కిరణ్మయి, డి.అరుణపద్మ, ఎన్‌సీసీ కేడెట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో..

జ్ఞానాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధం(1999)లో వీరమరణం పొందిన భారతదేశ సైనికుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాద చాంబర్ సీనియర్ న్యాయవాది ధనలకోటి రమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ రక్షణకు సైనికులు చేసిన, చేస్తున్న త్యాగాలు, పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యాపకులు పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్య కుమారి, లీలాప్రసాద్, ఎన్.నాగరాజు, రమేష్, టోనియా తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో మహిళ ఇల్లు కూల్చివేత

» అక్రమ నిర్మాణమని తెలిపిన అధికారులు » రోడ్డున నిలబెట్టారని బాధితురాలి ఆవేదన


జీవీఎంసీ సిబ్బంది కూల్చివేస్తున్న ఇల్లు

సీతమ్మధార, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల ఒక ఇంటిని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు శనివారం పోలీసు బందోబస్తుతో వచ్చి కూల్చివేశారు. ఆ ఇంటిలో నివసిస్తున్న ఓ మహిళను రోడ్డుపై నిలబెట్టారు. ఇంటిలో సామాగ్రిని రోడ్డుపై పడవేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టడంతో తొలగిస్తున్నామని జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. బాధితురాలు కంటతడిపెట్టి వేడుకున్నా టీపీఓ శ్రీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది వారి పని వారు కానిచ్చేశారు.

'పన్నులు కడుతున్నా రోడ్డున పడేశారు'

ఆ స్థలంలో కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నానని, తల్లిదండ్రుల కాలం నుంచే చిన్న రేకులు, కమ్మలతో ఇల్లు కట్టి ఉంటున్నట్లు గుడ్ల దాలయ్యమ్మ విలపిస్తూ చెప్పింది. తన వద్ద ఉన్న పాత ఇంటి పన్ను పుస్తకాన్ని కూడా జీవీఎంసీ సిబ్బంది చూసి ఇస్తామని చెప్పి తీసుకొని తిరిగి ఇవ్వలేదని ఆమె తెలిపింది. జీవీఎంసీ సిబ్బంది తెల్లవారుజామున 5 గంటలకు పోలీసులతో వచ్చి ఇంటిని కూల్చివేశారన్నారు. ఇంటి పన్ను చెల్లించిన పుస్తకం లాక్కున్నారని, ఇంటికి ఉన్న విద్యుత్, కొళాయి కనెక్షన్లు కూడా తొలగించారని ఆవేదన వ్యక్తం చేసింది. అన్ని పన్నులు కడుతున్నా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డున పడేశారని ఆరోపించింది.


పన్నుచెల్లించిన రసీదు చూపుతున్న కుటుంబం

మడ అడవుల ప్రాధాన్యంపై అవగాహన


అతిథి శ్రీనివాస్‌తో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం అంతర్జాతీయ మడ అడవుల పర్యావరణ పరిరక్షణ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కోస్టల్ ఎకోసిస్టమ్ సెంటర్‌తో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐసీఎఫ్ఆర్ఈ ఇన్‌చార్జి డాక్టర్ టి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మడ అడవుల ప్రాముఖ్యత, స్థిరమైన నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ తీరప్రాంత రక్షణ, జీవ వైవిధ్యంతోపాటు వాతావరణ నియంత్రణలో మడ అడవులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం బోటనీ విభాగాధిపతి డాక్టర్ టి.ఎం.ఎ.నివేదిత మాంగ్రూవ్ మొక్కలను ప్రదర్శించి వాటి ప్రత్యుత్పత్తి విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగం డాక్టర్ కె.లావణ్య, అరుణపద్మ, డాక్టర్ పి.ఎల్.శరణ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎస్సీ, ఎస్టీల చట్టాలు

» దళిత హక్కుల పోరాట సమితి చర్చా కార్యక్రమంలో సీపీఐ నేత జె.వి.సత్యనారాయణమూర్తి

సీతమ్మధార, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా చేసిన చట్టాలు రోజు రోజుకు నిరుపయోగంగా మారుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. రామాటాకీస్ రోడ్డులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం రక్షణ, రాజ్యాంగంలో సెక్యులర్, సోషలిజం పదాల పరిరక్షణ అంశంపై చర్చా కార్యక్రమం, డీహెచ్‌పీఎస్ జిల్లా ఐదో మహాసభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పోరాటాలతోనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆ చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. అనేక మంది ఎస్సీ, ఎస్టీలు ఎలాంటి విచారణ, బెయిలు లేకుండా జైళ్లలో మగ్గుతున్నారని తెలిపారు. కార్పొరేట్లకే ప్రభుత్వం సింహభాగం నిధులను దోచిబెడుతున్నాయని తెలిపారు. హక్కులను హరిస్తే కుర్చీ లాగేస్తామని హెచ్చరిక చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ రాజ్యాంగం మీద నమ్మకం లేని వారు నేడు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. రాజ్యాంగానికి ఉన్న గౌరవం జాతీయ జెండాపై ఉండాలని దాని స్థానంలో కాషాయం జెండా ముందు పెడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో లౌకిక వాదం, సామ్యవాదానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పెద్ద పీట వేసారని, ఆ రెండింటిని తీసేసే కుట్ర నేడు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు, రాష్ట్ర అధ్యక్షుడు జెవి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బొడ్డు కళ్యాణరావు, ప్రొఫెసర్ అర్జున్, సూరప్పడు, కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, వేదికపై సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బొడ్డు కళ్యాణరావు తదితరులు

తిరుమల నగర్‌కు ఆర్‌డబ్ల్యూఏ స్వచ్ఛ అవార్డు

కూర్మన్నపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీకి ఆర్‌డబ్ల్యూ కేటగిరిలో స్వచ్ఛ అవార్డు లభించింది.విశాఖ నగరానికి జాతీయ స్థాయిలో సఫాయి మిత్ర సురక్షిత్ షేహర్ అవార్డు వచ్చిన సందర్భాన్నిపురస్కరించుకొని శనివారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన స్వచ్ఛ అవార్డు సన్మాన కార్యక్రమంలో తిరుమలనగర్ ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎంపీ శ్రీభరత్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, నగర మేయర్ పీలా శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, టీడీపీ నగర అధ్యక్షుడుగండి బాబ్జీల చేతులు మీదుగా స్వచ్ఛ పురస్కారాన్ని, అభినంధన పత్రాన్ని తిరుమల నగర్ కాలనీ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, సన్యాసిరావు, అప్పల నాయుడు,చంద్రశేఖర్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి జి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంపునకు వందలాది ఇంకుడు గుంతలు తవ్వించినందుకు, ప్లాస్టిక్ నివారణకు ర్యాలీలు, అవగాహనా సదస్సులు, కాలుష్య నివారణకు మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్, శ్రమదానాలను కాలనీ వాసులకు దినచర్యగా అభ్యసన చేయించడంలో కాలనీ ప్రతినిధులు చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించిందని తెలిపారు. వాటర్ హీరో గ్రహీత ఎం.పరమానందం మాట్లాడుతూ తిరుమల నగర్ కాలనీకి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఇప్పటికే 26 అవార్డులు వచ్చాయన్నారు. ఈ అవార్డు రావడం వెనుక కాలనీ వాసులు కృషి ఉందన్నారు.కార్యక్రమంలో పలువురుఅధికారులు,కాలనీవాసులుపాల్గొన్నారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకుంటున్న తిరుమల నగర్ కాలనీ ప్రతినిధులు, పాల్గొన్న తూరు ఎమ్మెల్యే వెలగపూడి

ఆకట్టుకుంటున్న నాగలింగ పుష్పాలు



86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో విరబూసిన నాగలింగ పూలు

కూర్మన్నపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో నాగలింగ వృక్షానికి అధిక సంఖ్యలో నాగలింగ పూలు పూశాయి. ఈ పుష్పాలు సువాసన కలిగి ఉన్నాయి. పుష్పాల మధ్యభాగం పడగ విప్పిన సర్పం వలే ఉంటుంది. ఈ పుష్పాలు శివుడికి ప్రీతిపాత్రమైనవని భక్తులు తెలిపారు. నాగలింగం చెట్టు శాస్త్రీయ నామం 'కౌరౌపిటా గియానెన్సిస్' అని, ఆంగ్ల పరిభాషలో కూనన్ 'బాల్ ట్రీ' అంటారని వృక్షశాస్త్ర నిపుణులు తెలిపారు. ఈ వృక్షాలు దక్షిణ అమెరికా, దక్షిణ భారత దేశంలో ఎక్కువగా ఉంటాయన్నారు. శివలింగ వృక్షం శివుడి జటాజూటముల ఆకృతిలో వెంట్రుకలు విరబూసినట్టు ఉంటాయి. పుష్పాలు కొమ్మలకు పూయకుండా వెంట్రుకల లాంటి జడలకు పూస్తాయి. పై భాగాన నాగ పడగ కప్పి ఉన్నట్టుగా ఉండి లోపల శివలింగ ఆకృతిని కలిగి ఉంటాయి. వీటికి శివలింగ పుష్పాలు అని, నాగలింగ పుష్పాలు అని, మల్లిఖార్జున పుష్పాలు అని అంటారు. ఈ పుష్పాలు అద్భుత సుగంధ పరిమళాలను వెదజల్లుతుండడం స్థానికులు ఆస్వాదిస్తున్నారు

ఉత్తరాంధ్ర నేతలకు అధిక ప్రాధాన్యం

» ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పటినప్పటి నుంచి ఉత్తరాంధ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ, ముఖ్యనాయకుల భాగస్వామ్యంతో ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని ప్రజల ఆశయాలు, అవసరాలు బాగా అర్థంచేసుకున్న నాయకత్వం చంద్రబాబునాయుడిదే అన్నారు. ప్రజలు మెచ్చుకున్న నాయకులైన కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్రమంత్రిగా, అశోక్ గజపతిరాజును గవర్నర్‌గా పదవులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే విద్య, వైద్యం, రవాణా రంగాల్లో పెట్టుబడులు ఉత్తరాంధ్రకు రాబట్టేందుకు ముఖ్యమంత్రి స్వయంగా కృషి చేస్తున్నారన్నారు. సీమాంధ్ర, ఉత్తరాంధ్ర సమాన అభివృద్ధి కోసం గడచిన కొన్ని రోజులుగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు మైలు రాళ్లగా నిలుస్తాయని శ్రీభరత్ పేర్కొన్నారు.

ధర్మస్థలి నేరస్థులను శిక్షించాలి

గాజువాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థలిలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్‌మహిళా సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం పాత గాజువాకలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వనజాక్షి, ఎంఏ బేగం మాట్లాడుతూ ధర్మస్థలిలో మహిళలపై దాడులు జరుగుతున్నప్పటికీ కేంద్రం స్పందించలేదని ఆరోపించారు. మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.పుష్పలత, నాయ కులు పాల్గొన్నారు.

బోరువెల్ ప్రారంభం

అగనంపూడి జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని పాత అగనంపూడిలో మంచినీటి బోరును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వార్డుఅధ్యక్షుడు కరణం జగదీశ్, కూటమి నేతలు కరణం సత్యారావు, కరణం పైడిరాజు, హనిత, సింగిడి సింహాచలం, మాడిశ వెంకటరావు, పల్లెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సమాజ సంక్షేమానికి కృషి చేసే స్వచ్ఛంద సంస్థలకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేజీఆర్ యువసేన ఆద్వర్యంలో శనివారం తుంగ్లాం ప్రాదమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు గోవిందరెడ్డి పుస్తకాలు ఇతర పాఠ్యసామాగ్రి పంపిణీచేశారు. కార్యక్రమంలో కేజీఆర్ యువసేన సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరం

» విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి



కార్యక్రమంలో పాల్గొన్న విజ్ఞాన్ ప్రిన్సిపాల్ అరుంధతి, విద్యార్థులు

అగనంపూడి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం, సామాజిక బాధ్యతలను పోత్సహించేందుకు శనివారం విద్యార్థులతోక్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజం పట్ల సామాజిక బాధ్యత కలిగే విధంగా ఈ క్లబ్ పని చేస్తోందన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మానసిక, సామాజిక చైతన్యానికి ఈ క్లబ్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ఎనిమిదిన్నర కిలోల వెండి ఆభరణాల బహూకరణ



స్వామివారికి వెండి ఆభరణాలు అలంకరిస్తున్న అర్చకులు

పెదగంట్యాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి ఇరువురు భక్తులు ఎనిమిదిన్నర కిలోల వెండి ఆభరణాలు శనివారం బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యుడు పెదగంట్యాడ కోరాడకు చెందిన మిత్తన అప్పల రెడ్డి, లక్ష్మి దంపతులు ఏడున్న కిలోల వెండితో తయారు చేసిన కిరీటం, వామహస్తం, కటి హస్తం, శంఖు చక్రాలు, తిరునామం, పాదుకలు బహూకరించారు. అలాగే భానోజీ తోటకు చెందిన ఒక భక్తురాలు కిలో వెండితో చేసిన స్వామివారి పాదపీఠం బహూకరించారు. ఈ ఆభరణాలను ఊరేగింపు గాజువాక నుంచి గరుడాద్రికి తెచ్చి స్వామివారికి అలంకరించారు. శ్రావణమాసం మొదటి శనివారం ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, ప్రదీప్ చంద్ర, తాతాచార్యులు శాస్త్రోక్తంగా స్వామివారికి అలంకరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయప్రాంగణంలో భారీ అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలో బీజేపీ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసరావు, హిందూధర్మరక్షణ సమితి కొత్తలంక భువనేశ్వరిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాల్లో శ్రావణమాసం ప్రత్యేక పూజలు



కూర్మన్నపాలెం : గ్రీన్ సిటీలో వెంకన్నకు తులసీపత్రాల అర్చన



అక్కిరెడ్డిపాలెం : షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీవారికి సహస్రనామార్చన చేస్తున్న వేదపండితులు

కూర్మన్నపాలెం,జూలై 26 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస శనివారాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఇరగవరపు వాసుస్వామి పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, సహస్ర తులసితో విశేష అలంకరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో శ్రావణమాసం శనివారాన్ని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి ఆధ్వర్యంలో శ్రీకాశీ అన్నపూర్ణా దేవి అమ్మవారిని మల్లెలతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వ్యాఘ్రేశ్వరరావు శర్మ సామూహిక కుంకుమ పూజలు చేశారు. మహిళలు లలిత సహస్రనామ పారాయణం, భక్తి గీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున వేదపండితులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకించి, అనంతరం భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చిన పలు రకాల పుష్పాలతో స్వామి వారికి తోమాల సేవ చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దివ్యక్షేత్రంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసిన వేదపండితులు పలు రకాల పుష్పాలతో సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, కుంభ హారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యక్షేత్రంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఆటోనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో దోమల నివారణ జీవీఎంసీ మలేరియా విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జీవీఎంసీ 70వ వార్డు పరిధిలోని శ్రీనివాస నగర్, ఎల్వీనగర్, డ్రైవర్స్ కాలనీ, కుంచుమాంబ కాలనీలోని మురుగు నీటి నిల్వలు, ఇంటి ఆవరణలో దోమల వ్యాప్తికి కారణమవుతున్న ప్రదేశాలను గుర్తించి శనివారం క్రిమి సంహారక మందును పిచికారీ చేశారు. ఇళ్లు, మనం ఉండే పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సిబ్బంది సూచించారు.

ఉక్కు ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలి : ఇంటక్



మాట్లాడుతున్న ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు బకాయి ఉన్న జీతాలనుతక్షణమే చెల్లించాలని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు, ఉక్కు ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం అడ్మిన్ భవనం రోడ్డులో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని, జీతా లు సకాలంలో పూర్తిగా ఇవ్వాలని, టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి కరెంట్ బిల్లులు తగ్గించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, పీవీ రమణమూర్తి, మద్ది అప్పలరాజు, రమణ, నాయుడు పాల్గొన్నారు.

ప్రజల రక్షణలో చెక్‌పోస్టులు కీలకం

» ఏసీపీ పృథ్వీతేజ్



సరిపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు సూచనలిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ్

పెందుర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రించడానికి, అక్రమ రవాణాలు నియంత్రించడానికి, అనుమానితులను పట్టుకోవడానికి చెక్‌పోస్టులు కీలకమని వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజ్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని సరిపల్లి, పినగాడి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను శనివారం తనిఖీ చేశారు. విధులు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడి వారి పనితీరును సమీక్షించారు. చెక్ పోస్టుల వద్ద రాకపోకలు, సేఫ్టీప్రొటోకాల్స్, వాహన తనిఖీ తీరు, అనుమానితుల పట్ల ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై పలు సూచనలు చేశారు.

క్రీడా మైదానం అభివృద్ధి పనుల పరిశీలన



జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో అభివృద్ధి పనులన పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూలోని క్రీడామైదానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదానం ఆధునీకరణ కోసం రూ.1.3 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారని తెలిపారు. మైదానంలో అక్కడక్కడ నీరు నిలిచిపోవడంతో క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏఈ వెంకటలక్ష్మికి సూచించారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ కరపత్రాలు ఆవిష్కరణ

పెందుర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల పేదల మీద ఆర్థిక భారం పడుతుందని సీపీఐ న్యూడెమొక్రసీ విశాఖ ఏరియా కమిటీ నేత నిర్మల అన్నారు. చినముషిడివాడలో శనివారం స్మార్ట్ మీటర్లు వద్దంటూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ప్రజల మద్దతుతో ఆందోళనకు దిగి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

» జేడీ ఫౌండేషన్



విత్తనాల బంతులను వేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మనాభనగర్ కొండవాలు ప్రాంతంలో విత్తనాల బంతులను వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా వర్షాకాలం ప్రారంభంలో విత్తనాల బంతులను వేస్తామని, ఈ ఏడాది 25 వేల బంతులను వేసే కార్యాక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

మల్కాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తాను చనిపోయినా అవయవాలు బతికే ఉండాలని స్థానిక పల్లెవీధికి చెందిన మల్లెడి రంగమ్మ (74) అనే వృద్ధురాలు నేత్రాలను దానం చేశారు. ఆరోగ్యం బాగాలేక చికిత్స నిమిత్తం రెండు రోజుల క్రితం ఆమెను కేజీహెచ్‌లో చేర్పించారు. తాను చనిపోతే తన అవయవాలను దానం చేయాలని కూతురుకు తెలియజేశారు. అలా చెప్పిన కొద్ది సేపటికే ఆమె మృతిచెందారు. ఈ విషయాన్ని కేజీహెచ్ వర్గాలకు తెలియజేయడంతో ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రి బృందానికి తెలియజేశారు. వారు వచ్చి ఆపరేషన్ అనంతరం రంగమ్మ కళ్లను తీసుకువెళ్లారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

పెందుర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97వ వార్డులో సుజాతనగర్‌లోని కార్పొరేషన్ నిధులతో నిర్మిస్తున్న కల్వర్టును వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టు పనులు పూర్తయితే కార్మికనగర్, గిరి ప్రసాద్ నగర్, సుజాతనగర్‌లోని రహదారులకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. కల్వర్టు పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సిబ్బందిని ఆదేశించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండవాలు ప్రాంతాల్లోని డ్రైనేజీ, రహదారుల నిర్మాణాలను పరిశీలించి, పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కొండవాలు ప్రాంతంలో మౌలిక వసతులు కల్పనకు దృష్టి సారిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్స్ సూపర్‌వైజర్ సోమేశ్, జ్యోతి వెంకటలక్ష్మి స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణం పూర్తి



దుర్గానగర్‌లో నిర్మాణం పూర్తయిన శివాలయం

మల్కాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దుర్గానగర్ కొండమీద కాశీ ఉమామహేశ్వర శివాలయ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయాన్ని నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుర్గానగర్ ప్రాంతానికి చెందిన ఏదూరి శంకర్‌రెడ్డి అనే వ్యక్తి యూరప్‌లో స్థిరపడ్డారు. ఆయన తన సొంత నిధులు రూ.1 కోటితో ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా కాశీ నుంచి ప్రత్యేకంగా శివలింగాలను తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అలాగే దుర్గానగర్‌లో మంచినీటి సదుపాయం కల్పించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేస్తానన్నారు.

పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు

గోపాలపట్నం, జూలై 26(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇటీవలే పార్కు స్థలాల్లో ఆక్రమణలు తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పనుల్లో భాగంగా నవర గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఒక కుటుంబం చాలా ఏళ్లగా గుడిసె వేసుకుని నివాసముంటోంది. కమిషనర్ ఆదేశాల మేరకు పార్కు స్థలాల ఆక్రమణల తొలగింపుపై గాజువాక జోనల్ కార్యాలయం సిబ్బంది శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో నవర పార్కు స్థలంలో ఉన్న గుడిసెను తొలగించడానికి అధికారులు వచ్చారు. దీంతో ఆ కుటుంబం గ్రామ పెద్దలను ఆశ్రయించింది. గ్రామ పెద్దలు అధికారులతో మాట్లాడతామని హామి ఇచ్చారు. వేరే చోటుకు వెళ్లడానికి కొద్ది రోజులు గడువు ఇస్తే స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లిపోతారని గ్రామ పెద్దలు అధికారులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము విధులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలపడంతో వారి మధ్య వివాదం జరిగింది. ఆ తరువాత గ్రామస్థులు బాధితుడిని వేరే చోటికి తరలిచడంతో, ఆ స్థలంలో ఉన్న గుడిసెను తొలగించారు.

కొనసాగుతున్న భూ పత్రాల పరిశీలన

వేపగుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూ వివాదానికి వివాదంకు సంబంధించిన రైతులు రికార్డుల పరిశీలన కార్యక్రమం మంగళ, బుధవారాల్లో కొనసాగనుంది. ఈ సదర్భంగా డీటీ భారతి మాట్లాడుతూ శనివారమే పరిశీలన కార్యక్రమం ముగియాల్సి ఉంది, కానీ రైతుల నుంచి స్పందన ఎక్కువగా ఉన్నాదని, రికార్డులు సరి చేసుకోవడానికి ఎక్కువ సమసయం పడుతుందని, ఈ మూడు రోజుల్లోనే 200లకు పైగా దరఖాస్తులు వచ్చాయని అందుకు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇంకా ఎవరైన రికార్డులు తీసుకురాని వాళ్లు ఉంటే మంగళ, బుధ వారాల్లో తీసుకురావాలని తెలిపారు.

మంచినీటి బోరు ప్రారంభం

గోపాలపట్నం, జూలై 26(ఆంధ్రజ్యోతి): దశల వారీగా వార్డులోని అభివృద్ధి పనులు చేపట్టనున్నామని వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు సంతోశ్ నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

70వ వార్డులో 'తొలి అడుగు'

కూర్మన్నపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పనిచేస్తోందని 70వ వార్డు టీడీపీ నేతలు అన్నారు. వార్డులోని శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులు మాట్లాడుతూ 'తొలి అడుగు' కార్యక్రమానికి జనం నీరాజనాలు పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

50 మద్యం బాటిళ్లు పట్టివేత



స్వాధీనం చుసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

పెందుర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): డీఆర్‌సీ మాల్ ఎదురుగా అనుమతులు లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు శనివారం నిర్వహించిన సోదాల్లో 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. ఆనందపురం మండలంలోని శొంఠ్యాం గ్రామానికి చెందిన ఎర్ర మాధవ్(43) సంచితో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడనే సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారు. తనిఖీలు చేయగా అతని వద్ద మద్యం సీసాలు లభ్యమయ్యాయి. స్థానిక మద్యం దుకాణాల్లో బాటిళ్లను కొని, వాటిని గ్రామంలోని దుకాణాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ అధికారులపై కార్పొరేటర్ ఫిర్యాదు

మల్కాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తాను ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి అవడంతో జీవీఎంసీ అధికారులు అవమానిస్తున్నారని, కనీసం ప్రొటోకాల్ పాటించడంలేదని జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శనివారం జీవీఎంసీ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, ఒక కార్పొరేటర్‌గా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వాన్ని ఒప్పించి ఆమోదింపచేశానని, ఇప్పుడు కనీసం వాటి శంకుస్థాపనకు గాని ఆహ్వానించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులు టీడీపీ నాయకులతో మమేకమై ఈ విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తనను అవమానించినవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసేందుకు నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళదుంపలు 16, అరటికాయ(పె)10, మునక్కాడలు(కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి(పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద42, , గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

అమ్మంటే మెరిసే మేఘం.. నాన్నంటే నీలాకాశం..



ప్రేమ, ఆప్యాయతలకు ప్రతిరూపం తల్లిదండ్రులు

- పిల్లల ఎదుగుదలకు, వారి ఉన్నతికి శ్రమించే శ్రామికులు
- వారి త్యాగాలను గుర్తించి, ప్రేమించడం పిల్లల బాధ్యత
- ప్రస్తుత రోజుల్లో ఆ బంధాలు కనుమరుగు

నేడు ప్రపంచ పేరెంట్స్ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం): **అమ్మంటే మెరిసే మేఘం, కురిసే వాన... నాన్నంటే నీలాకాశం తలవం చేనా.. అన్నాడో సినీ కవి. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిచ్చిన నుంచి వారు పెరిగి పెద్దయ్యే వరకూ కంటికి రెప్పలా సాకుతారు. వారి ఆనందమే తమ సంతోషంగా... వారి కష్టమే తమ బాధగా.. జీవిస్తారు. పిల్లల ఎదుగుదలకు, వారి ఉన్నతికి నిరంతరం శ్రమిస్తారు. అందుకు ఎన్నో త్యాగాలు చేస్తారు. వ్యక్తిగత జీవితాన్ని కూడా వదులుకుంటారు. కానీ ప్రస్తుత రోజుల్లో కొందరు పిల్లలు తల్లిదండ్రుల కష్టాన్ని, శ్రమను మరుస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న అమ్మ నాన్నలను భారంగా భావిస్తున్నారు.తల్లిదండ్రుల త్యాగాలను, శ్రమను గుర్తించి వారిని గౌరవించడం పిల్లల కనీస బాధ్యత. నేడు ప్రపంచ పేరెం ట్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.**

తల్లిదండ్రుల దినోత్సవాన్ని గడిచిన కొన్నాళ్లుగా అనేక దేశాల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తొలిసారిగా నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ 1994 జూలై నాలుగో ఆదివారాన్ని అధికారికంగా తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించుకునేందుకు జాతీయ పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి అనేక దేశాల్లో పేరెంట్స్ డేను నిర్వహిస్తూ వస్తున్నారు. తమను పెంచేందుకు, ఉన్నత స్థానానికి చేరుకునేందుకు చేసిన కృషిని, త్యాగాన్ని పిల్లలు గుర్తు చేసుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. పేరెంట్స్ డే రోజున పిల్లలంతా తమ తల్లిదండ్రులతో కలిసివుండడం, వారికి ప్రత్యేక బహుమతులిచ్చి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడం, కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందాన్ని పంచుకోవడం దీని ప్రధాన ఉద్దేశంగా పేర్కొంటున్నారు.

తల్లిదండ్రుల శ్రమను గుర్తించాలి

పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంతగానో శ్రమిస్తుంటారు. జీవితంలో పిల్లలు నిలదొక్కుకునేంత వరకు అండగా ఉండే తల్లిదండ్రులను ఎంతోమంది ఆ తరువాత పట్టించుకోరు. రెక్కలు వచ్చిన పక్షులు మాదిరిగా ఎగిరిపోతూ తల్లిదండ్రులను అనాథలను చేస్తుంటారు. దీంతో ఎంతమంది పిల్లలున్నా ఎవరూ లేని అనాథలుగా జీవిస్తున్న పేరెంట్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు కారణం పిల్లల్లో స్వార్థం పెరిగిపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగం, వ్యాపారం, తన కుటుంబం, స్వేచ్ఛ, ప్రైవసీ.. అంటూ ఎంతోమంది పిల్లలు తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన తల్లిదండ్రులను ఒంటరిగా విడిచిపెడుతున్నారు. ఇంకొంతమంది అనాథాశ్రమాల్లో చేర్పించేస్తున్నారు. పిల్లల్లో నెలకొన్న ఇటువంటి ఆలోచనల్లో మార్పులు రావాలి. ఏడాదికి ఒకసారైనా తల్లిదండ్రులు తమ కోసం చేసే త్యాగాలను పిల్లలకు గుర్తు చేసేందుకే 'పేరెంట్స్ డే'ను నిర్వహిస్తున్నారు.

ఆనందంగా ఉండేలా చూడాలి

ఎక్కడ ఉన్నా.. ఎలా ఉన్నా.. తల్లిదండ్రులను మాత్రం ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పిల్లలదే. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇబ్బందులు పెట్టకూడదనే ఉద్దేశంతో వయసు పైబడినా కూడా సమస్యలను ఎదుర్కోవడం మంచిది. చిన్న వయసు నుంచే పిల్లలకు విలువలతో కూడిన జీవన విధానాలను, కుటుంబ వ్యవస్థలో కీలకంగా వ్యవహరించే తల్లిదండ్రుల గొప్పతనాన్ని తెలియజేయాలి. అలా చేయడం ద్వారా పిల్లలు ఎక్కడ ఉన్నా తుది వరకు తల్లిదండ్రులను ప్రేమిస్తూనే ఉండేలా చేసేందుకు అవకాశం ఉంటుంది. కొందరు పిల్లలు ఆస్తుల కోసం మాత్రమే తల్లిదండ్రుల పట్ల ప్రేమను నటిస్తూ... ఆ తరువాత వారిని అనాథలుగా చేసే సంఘటనలను కూడా తరచూ చూస్తున్నాం. ఈ తరహా ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులంటే తమకు జీవితాన్ని ఇచ్చిన వాళ్లే కాదు... భవిష్యత్తుకు బాటలు వేసిన దార్శనికులని అందరూ గుర్తెరగాలి.. వారు జీవితాంతం ఆనందంగా ఉండేలా చూసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ సమీపంలో జూ పార్కు ఎదురుగా శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతదేహం తలకు బలమైన గాయాలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి నడచి వెళుతుండగా, ఏదైనా వాహనం ఢీకొని మృతి చెంది ఉండవచ్చని ఆరిలోవ పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటాయి. మృతుడి వివరాలు తెలిసిన వారు ఉంటే సంప్రతించాలని ఆరిలోవ పోలీసులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జర్మన్ లాంగ్వేజ్ కోర్సు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రామారావు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జర్మన్ లాంగ్వేజ్ కోర్సులో శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాళ్లతో శనివారం సాయంత్రం ఆయన ఎంవీపీలోని సంక్షేమశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు పూర్తిచేసి మూడేళ్ల అనుభవం కలిగిన యువతులకు ఈ కోర్సులో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈ కోర్సులో చేరాలని, ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రూ.రెండు లక్షలకు పైగా వేతనంతో ఉద్యోగావకాశం కల్పించడం జరుగుతందన్నారు. సమావేశంలో పలువురు అధికారులు, ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, నేవీ ఉన్నతాధికారులు

బీచ్ రోడ్డు, జులై 26 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ అమర వీరులకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఘనంగా నివాళులర్పించారు. శనివారం బీచ్ రోడ్డులో గల కార్గిల్ దివస్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన సైనికుల ధైర్యసాహసాలు చిరస్మరణీయమన్నారు. మన జవాన్ల పరాక్రమం, ధైర్యానికి ప్రతీక అని, వారి త్యాగం మన పౌరులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మాతృభూమి కోసం మన జవాన్లు చేసిన త్యాగం భావి తరాలు సైతం స్మరించుకుంటాయన్నారు. కార్యక్రమంలో నేవీ ఉన్నతాధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



ఉద్యోగిని సత్కరించి అవార్డు అందజేస్తున్న మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే, తదితరులు

పారిశుధ్య కార్మికల కృషి వల్లే 'సఫాయిమిత్ర' అవార్డు

మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీకి జాతీయ స్థాయిలో మినిస్టీరియల్ ప్రత్యేక కేటగిరిలో సఫాయిమిత్ర సురక్షిత్ షహేర్ అవార్డు దక్కడానికి పారిశుధ్య కార్మికుల కృషే కారణమని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో ప్రత్యేక కేటగిరి కింద జీవీఎంసీకి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు దక్కడానికి కారణమైన పారిశుధ్య కార్మికులు, కార్యదర్శులు, యూజీడీ సిబ్బంది, ఎన్‌జీవోలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు గ్రేటర్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో 5,800 మంది కార్మికులు ఉన్నారని, ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఈ సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ టెక్నాలజీని అందిపుచ్చుకుని నగరాన్ని మరింత శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావడమే పారిశుధ్య కార్మికుల పనితీరుకి నిదర్శనమన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ నగరం అభివృద్ధి చెందాలన్నా, పెట్టుబడులు రావాలన్నా సరే నగరంలో పరిశుభ్రత, రోడ్లు వంటివి కీలకమన్నారు. పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు, ఎన్‌జీవోలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ అధికారిగా రాజారావు



పి.రాజారావు

పెదగంట్యాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైన్స్ అధికారిగా పాలగుమ్మి రాజారావును నియమిస్తూ డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజారావు గంగవరం జడ్పీ ఉన్నత పాఠ శాల+2లో స్కూల్ అసిస్టెంట్ (కెమిస్ట్రీ)గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా సైన్స్ అధికారి బాధ్యతలను అప్పగించిన డీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌స్పైర్-మనక్, సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించి జన్మభూమి రుణం తీర్చుకోండి

- విశ్రాంత సైనికాధికారుల సత్కార కార్యక్రమంలో పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హితవు



సత్కార గ్రహీతలతో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, అతిథులు

సీతంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన మాతృమూర్తి, జన్మభూమి రుణం తీర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ 31వ వార్షికోత్సవాల్లో భాగంగా 'భారతీయ సైనికా.. నీకు వందనం, అభివందనం' అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళావేదిక వ్యవస్థాపకులు డాక్టర్ నండూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కమల్ బైద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అహర్నిశలు సరిహద్దులలో అప్రమత్తంగా ఉంటూ కొందరు తమ ప్రాణాలను సైతం త్యాగం చేయటం సైనికులకే చెల్లిందని, వారిని సత్కరించిన కళావేదిక కృషి అభినందనీయమన్నారు. సమావేశంలో పాల్గొన విశాఖ మహానగర్ సంఘ్ చాలక్ డాక్టర్ పి.వి.నారాయణరావు మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్'ని విజయవంతం చేయడంలో సైనికుల పాత్ర అమోఘమన్నారు. వివిధ హోదాలలో సేవలందించిన 60 మంది సైనిక అధికారులను (విశ్రాంత) ఘనంగా సత్కరించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ సత్యప్రసాద్, కళావేదిక కార్యదర్శి డాక్టర్ బి.రజని, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కె.ద్వారకానాథ్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సీహెచ్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయ పరిధిలో పది మంది మార్గదర్శులు

అధికారులకు కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ సూచన



మహారాణిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పదిమంది మార్గదర్శకులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద కుటుంబాలు బాగుపడేలా సరైన మార్గదర్శకులను గుర్తించాలన్నారు. విద్య, ఆరోగ్యం, ఆర్థికంగా ఆదుకోగలిగినవారిని గుర్తించి మార్గదర్శులను బంగారు కుటుంబాలకు పరిచయం చేయాలని సూచించారు. సోమవారానికి మార్గదర్శులను గుర్తించి, మంగళవారం నాటికి గ్రామ సభలు నిర్వహించాలని నిర్దేశించారు. ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాలను మార్గదర్శులకు అనుసంధానించడం పూర్తిచేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ, ప్రైవేటు, ఉన్నత స్థాయి ఉద్యోగులు, వైద్యులు మార్గదర్శులుగా ముందుకు వచ్చి పేదలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

గీతంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

- 3,513 మందికి పట్టాలు అందజేత



పట్టాలు అందజేస్తున్న బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఉపాధ్యక్షుడు ఎన్. నారాయణ్, ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

ఎండాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వైద్య కళాశాల ఆడిటోరియంలో గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పలు కోర్సులు పూర్తి చేసిన 3377 మంది పట్టభద్రులకు డిగ్రీలు, 136 మంది పరిశోధకులకు డాక్టరేట్లను, అత్యుత్తమ ప్రతిభ చూపిన 28 మందికి బంగారు పతకాలు అందజేశారు. ఉత్తమ పరిశోధనలకు గాను ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి. భరణి చంద్రకుమార్ అవార్డు అందుకోగా, జీవశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ పి. శాంతిలత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పరిశోధన, అభివృద్ధి కేంద్రం అధిపతి, సంస్థ ఉపాధ్యక్షుడు ఎన్. నారాయణ్ మాట్లాడుతూ భవిష్యత్తులో దేశాభివృద్ధిలో యువతరం కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. పరిశ్రమలు, కార్పొరేట్ రంగం, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు యువత పరిష్కారం చూపాలని, అందుకు నూతన సాంకేతికతపై పట్టు పెంచుకోవాలని సూచించారు. గీతం అధ్యక్షుడు. ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ విలువలతో కూడిన బోధనతో పాటు అత్యున్నత స్థాయి పరిశోధకులను ప్రోత్సహించడం తమ లక్ష్యమని చెప్పారు. ర్యాంకింగ్‌ల కోసం అడ్డదారులు తొక్కకుండా, విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. యువత ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకుండా కొత్త అవకాశాలను అందుకుని ఉద్యోగాలను సృష్టించే దిశగా ఆలోచన చేయాలన్నారు. సంపాదించడం ఒక్కటే లక్ష్యం కాకుండా సమాజానికి ఎంత కొంత తిరిగి ఇచ్చే బాధ్యత గల నవతరం దేశానికి అవసరమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, ఉపాధ్యక్షుడు గంగాధరరావు, కార్యదర్శి భరద్వాజ, జిమ్సర్ ప్రో వీసీ డాక్టర్ బి. గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.



ఏడీసీ వర్మకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్, కేకే రాజు, తదితరులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 10 మంది వైసీపీ కార్పొరేటర్ల నామినేషన్లు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో పోటీ చేసేందుకు వైసీపీకి చెందిన పదిమంది కార్పొరేటర్లు శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుతో కలిసి జీవీఎంసీ ఏడీసీ ఎస్ఎస్‌వర్మకు అందజేశారు. నామినేషన్లను నక్కెళ్ల లక్ష్మి (20వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు), బిపిన్‌కుమార్ జైన్ (31వ వార్డు), గుండపు నాగేశ్వరరావు (40వ వార్డు), కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), కేవీఎస్ శశికళ (55వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), ఉరుకూటి రామచంద్రరావు (70వ వార్డు), తదితరులు దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటమూరి సతీశ్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్ద బియ్యం పంపిణీ



వృద్ధురాలికి బియ్యం పంపిణీ చేస్తున్న డీఎస్‌వో భాస్కర్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలకు సంబంధించి వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత బియ్యం పంపిణీని శనివారం ప్రారంభించారు. రేషన్ డీలర్లు తమ పరిధిలో గల వృద్ధులు/దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి బియ్యం, పంచదార అందజేసి వేలిముద్ర తీసుకున్నారు. ఇందులో భాగంగా సీతంపేటలో పలువురి వృద్ధుల ఇళ్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ వెళ్లి సరకులు అందజేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో 35,130మంది వృద్ధులు, దివ్యాంగులలో 4,671 (13.30 శాతం)మందికి అందజేశామని డీఎస్‌వో తెలిపారు. జిల్లాలో 65ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశించామన్నారు.





